తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
30 ఏళ్ళ ప్రస్థానం 30 వార్త వార్షికోత్సవం 1996 - 2026
వార్త

అక్రమాల అడ్డాగా... ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణం

-ఆకతాయిల తిష్ట... పశువుల సంచారం

తిరుపతిరూరల్, మే 1 ప్రభాతవార్త: ప్రభుత్వ కార్యాలయాలకు ఆదర్శంగా ఉండాల్సిన తిరుపతి రూరల్ ఎంపిడిఓ కార్యాలయ ప్రాంగణం ప్రస్తుతం ఆకతాయిలకు, పశువులకు, ప్రవేట్ వాహనాలకు అడ్డాగా మారిందన్న ఆరోఫణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఈ ప్రాంగణంలోనే గృహ నిర్మాణ, తిరుపతిరూరల్ విద్యా శాఖ,వెలుగు, ఉపాధిహామీ కార్యాలయాలు కూడా ఉన్నాయి. నిరంతరం ఆకతాయి యువతతో ప్రవేట్ వాహనాలతో ఆయా కార్యాలయాల్లో సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటూ లోలోనే బాధపడుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

మద్యం... గంజాయి వినియోగం ఆరోపణలు:

కార్యాలయ ప్రాంగణంలో రోజు కొంత మంది యువకులు గుంపులుగా చేరి మద్యం సేవించడం... గంజాయి వినియోగం చేయడం జరుగుతుందని సిబ్బంది ఆరోఫిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో, సెలవు దినాల్లో ఈ కార్యకలాపాలు ఎక్కువుగా జరుగుతున్నాయని చెబుతున్నారు. ఈ ఆకతాయిలకు పార్కింగ్ స్థలాలే అడ్డాగా మారాయి అని అంటున్నారు. ఆకతాయిలు తిష్టతో కార్యాలయానికి వచ్చే మహిళలు, వృద్దులు భయాందోళనకు గురవుతున్నారని సమాచారం. కార్యాలయ వాతావరణం ప్రశాంతంగా లేకపోవడంతో పనులు సజావుగా సాగడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

చర్యలు తీసుకోవాలని సిబ్బంది డిమాండ్:

ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, ప్రాంగణంలో భద్రత చర్యలు కట్టుదిట్టం చేయాలని సిబ్బంది,, ప్రజలు కోరుతున్నారు. కార్యాలయ ప్రాంగణానికి ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను ఎత్తుకు పెంచడంతో పాటు కట్టుదిట్టమైన గేట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అవసరమైతే సి.సి కెమెరాలు ఏర్పాటు చేయాలని, సెక్యూరిటీని నియామించాలని కోరుతున్నారు.

ఇంటి దొంగతనం కేసు చేధించిన పోలీసులు

- ఇద్దరు దొంగలు అరెస్టు
- రూ.15.25 లక్షల విలువైన బంగారు, వెండి నగలు, బైక్ స్వాధీనం
- డిఎస్పీ జె.వెంకటనారాయణ

దొంగలను అరెస్టు చేసి వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ

చిత్తూరు, మే 1 ప్రభాతవార్త: చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో మురకంబట్టు ఇందిరమ్మ కాలనీలో ఏప్రిల్ 24వ తేదీన జరిగిన ఇంటి దొంగతనం కేసును పోలీసులు చేధించారు. ఈ కేసులో చిత్తూరు తాలుకా పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుండి 15.25 లక్షల రూపాయల విలువైన 100 గ్రాముల బంగారు నగలు, 100 గ్రాముల వెండి నగలు, ఒక లక్ష రూపాయల విలువైన ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిఎస్పీ జె.వెంకటనారాయణ చిత్తూరు పోలీసు గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. మురకంబట్టు ఇందిరమ్మ కాలనీలోని సి.బాలాజీ(32) ఇంట్లో ఎవరు లేని సమయంలో ఏప్రిల్ 24వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి మెయిన్ డోర్ తలుపులు పగులగొట్టి బెడ్‌రూమ్‌లోని బీరువాను పగులగొట్టి బంగారు నగలు, వెండి వస్తువులు, నగదును దొంగతనం చేసి పారిపోయారని డిఎస్పీ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు ఎఎస్పీ డాక్టర్ తరుణ్ పహ్వా, తన పర్యవేక్షణలో ఈస్ట్ సర్కిల్ ఇన్స్ పెక్టర్ కె.రామచంద్ర ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ ప్రత్యేక బృందాల్లో పెనుమూరు ఎస్ఐ డి.శ్రీనివాసులు, తాలుకా స్టేషన్ ఎస్ఐలు వి.అశోక్‌కుమార్, వెంకటనారాయణలు, ఎన్ఆర్ పేట ఎస్ఐ మణికంఠేశ్వర్‌రెడ్డి, జిల్లా ఐడి పార్టీ సిబ్బంది, సర్కిల్ సిబ్బంది మొత్తం నాలుగు బృందాలుగా ఏర్పడి సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టారన్నారు. వీరి దర్యాప్తులో ఇంటి దొంగతనానికి పాల్పడింది సత్యసాయి జిల్లా ధర్మవరం నాగులబావి వీధికి చెందిన నమ్మే రామాంజనేయులు(27), తిరుపతి జిల్లా రేణిగుంట బిస్మిల్లా నగర్‌కు చెందిన నూరుల్లా(29)లుగా గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం చిత్తూరు రూరల్ మండలం పెనుమూరు క్రాస్ వద్ద నిందితులు నమ్మే రామాంజనేయులు, నూరుల్లాలు వున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అక్కడికి వెళ్ళి ఇద్దరిని అరెస్టు చేసి వారి నుండి నగదును స్వాధీనం చేసుకు న్నారన్నారు. రామాంజనేయులు ప్రస్తుతం తిరుపతి లీలామహల్ సెంటర్ దగ్గర పిఎస్-4 వెజ్ రెస్టారెంట్ వెనుక వైపు నివాసం వుంటూ జిల్లాలో పలు చోట్ల ఇళ్ళ దొంగతనాలకు పాల్పడుతుండేవాడన్నారు. ఇతనిపై సుమారు 24 కేసులు వున్నాయన్నారు. అలాగే మరో నిందితుడు నూరుల్లా రామాంజనేయులుకు వాహనం అందజేసి దొంగతనంకు సహకరించడన్నారు. కేసులో త్వరితంగా చేధించి నిందితులను అరెస్టు చేసి నగదును స్వాధీనం చేసుకున్న చిత్తూరు రూరల్ ఈస్ట్ సిఐ రామచంద్ర, పెనుమూరు ఎస్ఐ డి.శ్రీనివాసులు, తాలుకా ఎస్ఐలు వి.అశోక్‌కుమార్, ఎ.వెంకటరమణ, ఎన్ఆర్ పేట ఎస్ఐ మణికంఠేశ్వరరెడ్డి, జిల్లా ఐడి పార్టీ, సర్కిల్ సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

గంజాయి మత్తును వదలించేస్తాం!

-నూతన పరికరాలుతో టెస్ట్‌లకు పోలీసులు సిద్ధం

ప్రత్యేక మెడికల్ టెస్ట్ కిట్లనుప్రదర్శస్తున్న ఎస్పీ, డిఎస్పీలు

తిరుపతి,మే 1 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలో గంజాయి రహిత సమాజం నిర్మాణం కోసం పోలీస్ శాఖ సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు తెలిపారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రధాన కారణమని, వాటి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు అంచెల విధానంతో గంజాయి నిర్మూలన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటూ, పదే పదే నేరాలకు పాల్పడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసి జైలు శిక్షలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో నూతన సాంకేతికతతో గంజాయి సేవించే వారిని గుర్తించేందుకు ప్రత్యేక మెడికల్ టెస్ట్ కిట్లను ప్రవేశపెట్టామని, వీటి ద్వారా పాజిటివ్‌గా వచ్చిన వారి నుంచి సరఫరా మార్గాలపై కీలక సమాచారం సేకరిస్తామని తెలిపారు. గంజాయి వినియోగదారుల్లో మార్పు తీసుకురావడానికి కౌన్సెలింగ్ .పునరావాస చర్యలు కూడా చేపడుతున్నామని చెప్పారు. గంజాయి సేవించే అనుమానాస్పద వ్యక్తులు, విద్యా సంస్థలలో గంజాయి వినియోగం గురించి తగిన సమాచారం ఆధారంగా గంజాయి టెస్టులు చేసే విధానాన్నిప్రవేశ పెట్టనున్నట్లు కూడా తెలియజేశారు. పదే పదే టెస్టుల్లో పాజిటివ్‌గా వస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా తిరుపతి జిల్లాలో పోలీసుశాఖ తరపున నూతన పరికరాలను తెప్పించారు. ఈ పరికరం ద్వారా గంజాయి సేవించినా, మత్తులో ఉన్నా వెంటనే మూత్రం పరీక్షద్వారా క్షణాల్లో పాజిటివ్ గా నిర్ధారణ అవుతుంది. ఈ పరికరంలో మూత్రం రెండు చుక్కలతో ఆ వ్యక్తి యొక్క మత్తు ఎరుపురంగులో మారితే పాజిటివ్‌గా నిర్ధారణ చేస్తారు. ఇందుకు తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యవర్గాలు అందుబాటులో ఉంటారు. శుక్రవారం ఉదయం తిరుపతి పోలీస్ జిల్లాలో ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పోలీస్ అధికారులతో కలసి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు,రవి మనోహరచారి,ఐ రామకృష్ణ ,శ్రీనివాస్,ఎస్‌బి డిఎస్ పి. గీతా కుమారి,సిఐ విక్రమ్, తిరుమల డిఎస్పీ విజయశేఖర్, తిరుపతి డిఎస్పీ భక్తవత్సలం, శ్రీలత,సిఐలు పివిఎస్ రామకిశోర్ పాల్గొన్నారు.

ప్రజల నుండే...మీ భవిష్యత్తు తెలుసుకుంటా!

-సొంత జిల్లా ఎమ్మెల్యేలకు చంద్రబాబు హెచ్చరికలు

ప్రభాతవార్త-తిరుపతి:

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల తన పార్టీకి చెందిన ఎమ్మెల్యేల పనితీరుపై కఠిన హెచ్చరికలు జారీ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజల అభిప్రాయాలు, ఫిర్యాదులు, ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేసి అవసరమైతే చర్యలు తీసుకుంటానని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. ప్రజలతో నేరుగా సంబంధం కలిగి ఉండాల్సిన ప్రజాప్రతినిధులు కొందరు బాధ్యతల పట్ల నిరక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సీఎం అభిప్రాయ పడుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాల చేరికలో కొన్ని ప్రాంతాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే "ప్రజలే అసలు అద్దం అన్న భావనతో ఫీడ్‌బ్యాక్ సేకరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఆయన స్వంత జిల్లా అయిన ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కొందరు ఎమ్మెల్యేల పనితీరుపై సీఎం అసహనం వ్యక్తం చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. స్థానిక సమస్యల పరిష్కారంలో ఆలస్యం, ప్రజలతో మమేకం లోపించడం వంటి అంశాలు ఆయన దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే సంబంధిత ప్రజాప్రతినిధులకు సూచనలు చేసినట్లు సమాచారం. పార్టీ ప్రతిష్ఠను కాపాడుకోవడం, వచ్చే ఎన్నికల దృష్ట్యా బలమైన పునాది వేసుకోవడం కోసం ఈ చర్యలు కీలకమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. మొత్తానికి, ప్రజల ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేసి చర్యలు తీసుకోవాలని సీఎం తీసుకున్న నిర్ణయం పార్టీ అంతర్గత వ్యవస్థలో క్రమశిక్షణను పెంచే దిశగా ఒక కీలక అడుగుగా భావిస్తున్నారు.

వేడుకగా పొన్నకాల్వ ఉత్సవం

తిరుపతి,మే 1 ప్రభాతవార్త: చిత్రాపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని గోవిందరాజస్వామి పొన్నకాల్వ ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి, శ్రీకృష్ణస్వామి, ఆండాళ్ అమ్మవారు, సేనాధిపతి వారు వేర్వేరు తిరుచ్చిలపై ఊరేగింపుగా బయలుదేరి తిరుపతి రూరల్ తనపల్లి రోడ్డులోని పొన్నకాల్వ మండపానికి చేరుకున్నారు. అక్కడ ఉదయం 9 నుంచి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. సాయంత్రం 4.30 నుండి 5.30 గంటల వరకు పొన్నకాల్వ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అక్కడినుండి బయలుదేరి తిరుచానూరు సన్నిధి వీధిగుండా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం ముందుకు చేరుకునే సమయంలో అక్కడ మహద్వారం యొక్క ఒక తలుపును మూస్తారు (పద్మావతి అమ్మవారు తన బావఅయిన గోవిందరాజస్వామివారిని మూసిన తలుపుచాటు నుంచి చూస్తుంది అని ఐతిహ్యం). తరువాత తిరుచానూరు నుంచి ఊరేగింపుగా గోవిందరాజస్వామి ఆలయానికి చేరుకోవడంతో పొన్నకాల్వ ఉత్సవం ముగిసింది.

కపిలేశ్వరునికి పుష్పాభిషేకం

తిరుపతి,మే 1 ప్రభాతవార్త: టిటిడికి అనుబంధంగా ఉన్న కపిలేశ్వరాలయంలో శుక్రవారం పత్రపుష్పయాగం వైభవంగా జరిగింది. ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు కపిలేశ్వర స్వామి, కామక్షి అమ్మవారి ఉత్సవర్లకు నవ కలశ స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పత్ర పుష్పయాగ మహోత్సవం జరిగింది. ఇందులో చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి , కనకాంబరంలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో స్వామి, అమ్మవార్లకు పత్ర పుష్ప యాగం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, గార్డెన్ డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఆలయ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

డిజిటల్ డోర్ నెంబర్లతో... ప్రజల ముంగిటికే అన్ని సౌకర్యాలు

-ఇన్చార్జి కమిషనర్ శారదా దేవి

తిరుపతి,మే 1 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందిస్తున్న డిజిటల్ డోర్ నెంబర్లతో ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలను వారి ముంగిటికే అందిస్తున్నట్లు నగరపాలక సంస్థ ఇన్చార్జి కమిషనర్ శారదా దేవి తెలిపారు. క్యూఆర్‌కోడ్‌తో అనుసంధానమైన డిజిటల్ డోర్ నంబర్ల ఏర్పాటు పై కచ్చాపి ఆడిటోరియం లో నోడల్ ఆఫీసర్స్, మాస్టర్ ట్రైనర్లకు శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ అనంతపురం రీజియన్ పరిధిలోని 36 మున్సిపాలిటీ లకు సంబంధించిన ప్రతినిధులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న క్యూఆర్ కోడ్ డోర్ నెంబర్ల వలన ప్రజలం దరికీ ఎంత మేలు జరుగుతుంది అన్నారు. దీని వలన ప్రజలకు సంబంధించిన అన్ని సేవలు వారి ముంగిటికే అందే అవకాశం ఉందన్నారు. నోడల్ ఆఫీసర్లు, మాస్టర్ ట్రైనర్లు ప్రతి యుఎల్‌బిలో చక్కగా పనిచేసి మంచి ఫలితాలు వచ్చేలా రూపొందించాల న్నారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఏ కార్యాలయం అధికారులు చంద్రమోళి రెడ్డి, ప్రవీణ్, మేఘన, డిసిపీ ఖాన్, ఏసీపీ పార్వతిప్రియ, వివిధ మున్సిపాలిటీ లకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికలోకం సంతోషంగా ఉండేలా కృషి

- ప్రభుత్వవిప్ కంచర్ల శ్రీకాంత్

సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రభుత్వవిప్ కంచర్ల

కుప్పం, మే 1 ప్రభాతవార్త: కుప్పంలో వివిధ కార్మిక వర్గాల సోదరులు సంతోషంగా ఉండేలా తాము కృషి చేస్తున్నట్లు ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక చంద్రన్న కార్మిక భవన్ వద్ద మేడేను పురస్కరించుకుని ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పంలో కార్మికుల సౌకర్యార్థం ఇఎస్ఐ ఆస్పత్రి, మూడు ఎకరాల్లో ఆర్‌టిఏ కార్యాలయం, ఆటోనగర్ ఏర్పాటుకు సిఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామన్నారు. కార్మికుల సౌకర్యార్థం అదనపు భవనంకు 25లక్షలు నిధులు మంజూరుకు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. ప్రపంచంలో ఎంత టెకా న్షలజీ వచ్చినా మనుషుల అవసరం మారదని సంతోష్, ఆర్ఆర్ రవి,శ్యాంసుందర్, మంజు, కార్మికులు అధిక పేర్కొన్నారు. కార్మికులు పనితరం నేర్చు కుంటే ఉపాధి అవకాశాలు మెరుగుపడ తాయన్నారు. మన పిల్లలకు కష్టం రాకుండా వారు ఉన్నతస్థాయికి ఎదిగేలా సిఎం చంద్ర బాబునాయుడు చర్యలు చేపట్టారన్నారు. కుప్పంలో అభివృద్ధి అంటే 2024కు ముందు ఆతర్వాత అనే రీతిలో సిఎం చంద్రబాబు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నార న్నారు. 7234కోట్లతో ఇప్పటికే 27 దాకా పరిశ్రమలు కుప్పం వచ్చాయన్నారు. ఇవి ప్రారంభమైతే 40వేల దాకా యువతకు ఉపాధి ఇక్కడే లభిస్తుందన్నారు. రామ కుప్పంలో 500 ఎకరాల్లో కేంద్రం సహకారంతో సెంట్రల్ ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కానుందన్నారు. అలాగే ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటవు తున్నట్లు తెలిపారు. కుప్పంలో ఎయిర్‌పోర్టు నిర్మాణంకు అడ్డంకు లు తొలగాయన్నారు. జూన్26న సిఎం శంకుస్థాపన చేయను న్నట్లు చెప్పారు. కుప్పంలో ప్రజల జీవన, ఆర్థిక ప్రమాణాలు బాగు చేయాలనే కృతనిశ్చయంతో సిఎం పనిచేస్తున్నారన్నారు. కార్మికుల చెమటనుంచి పుట్టిన తెదేపా కార్మికులకు అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పికె ఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డుసభ్యుడు వైద్యం శాంతారాం, కడ సభ్యుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కార్మిక సంఘం అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సతే ్యంద్రశేఖర్, కౌన్సిలర్లు సోమశేఖర్, జాకీర్, కార్మిక నేతలు నాగరాజు, హరి, ఇస్మాయిల్, మాజీ సర ్పంచ్ డికెపల్లి మణి, సంతోష్, ఆర్ఆర్ రవి,శ్యాంసుందర్, మంజు, కార్మికులు అధిక

ఇటు దున్నకాలు...అటు నాట్లు

యూరియా కోసం అన్నదాతల అగచాట్లు

శ్రీకాళహస్తి,మే 1 ప్రభాతవార్త: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలు వ్యవసాయక ప్రధాన క్షేత్రాలు. ఇక్కడ రబీలో 32వేల హెక్టార్లులో వరి పంటను పండించగా ముందస్తు ఖరీఫ్ సీజన్లో వరితో పాటు వాణిజ్య పంటలు 32వేల హెక్టార్లలో పండిస్తారని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం యూరి యాకు కొరత లేదని చెబుతున్నా, అన్నదాతలు పంటలకు అవసరమైన యూరియా కొరత అంటూ వెంపర్లాడుతున్నారు.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని బావులు,బోర్లుతో వ్యవసాయం సాగించే అన్నదాతలు ముందస్తు ఖరీఫ్ సాగుకు సమాయత్తమౌతున్నారు. కొన్నిచోట్ల దున్నకాలు చేస్తుండగా మరి కొన్ని చోట్ల నార్లు, ఇంకొన్ని చోట్ల నాట్లు కార్యక్రమాలు యుద్ధ ప్రాతిపదికపై ముమ్మరంగా సాగుతున్నాయి. తెలుగు గంగ పుణ్యమా అని శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం, సత్యవేడు నియోజకవర్గంలోని బుచ్చినాయుడుకండ్రిగ, వరదయ్యపాళెం మండలాల్లో ముమ్మరంగా వ్యవసాయ పనులు చోటు చేసుకున్నాయి. తెలుగుగంగ నీటితో చెరువులు కళ కళ లాడుతుండగా రైతులు ఎండలను సైతం లెక్క చేయక పొలం పనుల్లో తలమునకలై ఉన్నారు. ముఖ్యంగా తొట్టంబేడు మండలంలోని చోడవరం, చియ్యవరం, కొత్తకండ్రిగ, జ్ఞానమ్మ కండ్రిగల్లో రైతులు దున్నకాల్లో తలమునకలై ఉన్నారు. ఇక కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేస్తున్నారు.

యూరియా కోసం అన్నదాతల పరుగులు:

అన్నదాతలు వ్యవసాయంలో యూరియాకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ప్రభుత్వం యూరియాకు స్వస్తి చెప్పాలంటున్నా పట్టించుకోవటం లేదు. దున్నకం నుంచి యూరియా యూరియా అంటూ దుకాణాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన యూరియాను ప్రభుత్వం రైతు సేవా కేంద్రాల ద్వారా అందిస్తున్నారు. అయితే రైతులు దుకాణం దారుల వద్దకు వెళ్ళినపుడు వారు యూరియాకు ఫాస్పెట్ లింకు పెట్టి లొల్లి చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.ఫాస్పెట్ బస్తా ధర రూ.1300లు చెల్లించాలి. అసలే కష్టాల సాగు చేస్తున్న రైతులకు ఈలొల్లి అదనపు భారంగా మారుతుంది. శ్రీకాళహస్తిలో సుమారు 50 నుంచి 60 ఎరువులు,విత్తనాల అమ్మకాల దుకాణాలున్నాయి. ఈ దుకాణాల ఎదుట స్టాక్ బోర్డులుంటాయి కానీ వాటిలో ఎంత స్టాక్ ఉందో తెలపరు. ఇక ఏ ఎరువు ధర ఎంత ఉందో పేర్కొనరు. అయితే దీనిని పర్యవేక్షించాల్సిన శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తారు. ఏదీ పట్టించుకోరు? ఏదీ కనబడదు. మొక్కుబడిగా అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీల పేరుతో హంగామా తప్ప రైతులకు సంబంధించిన సమస్యపై అధికారుల చిత్తశుద్ధి ప్రశ్నార్థకంగా మారింది. శ్రీకాళహస్తిలో రైతులు యూరియా కోసం వెంపర్లాడుతున్న రైతుల సమస్యలను గురించి వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డిని వివరణ కోరగా ఇప్పటి వరకు వ్యవసాయ పనులే ప్రారంభం కాలేదన్నారు. యూరియాకు కొరత లేదన్నారు.

పీజీ పరీక్షల నిర్వహణపై...యస్వీయూ వీసీ తనిఖీ

తిరుపతి విద్య, మే 1 ప్రభాతవార్త : యస్వీయూలో శుక్రవారం నుంచి ప్రారంభమైన పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయ అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో యస్వీయూ ఉపకులపతి ఆచార్య టాటా నరసింగరావు స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షి ం చారు. విశ్వవిద్యాలయంలోని సైన్స్ కళాశాల, ఆర్ట్స్ కళాశాలల్లో నిర్వహిస్తున్న పరీక్షల తీరును ఆయన పరిశీలించి, అన్ని విభాగాల్లోనూ నియమ నిబంధనలు కచ్చితంగా పాటిస్తున్నారని గుర్తించారు. పరీక్షా హాళ్లలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించడం పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భ ంగా ఉపకులపతి మాట్లాడుతూ, పరీక్షల నిర్వహణలో ఎటువంటి నిరక్ష ్యం లేకుండా చేసుకోకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా పారదర్శకత, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.పరీక్షా కేంద్రాల్లో భద్రతా చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థ, సీసీ కెమెరాల వినియోగం వంటి అంశాలను కూడా పరిశీలించిన ఆయన, పరీక్షల నిర్వహణలో సాంకేతిక వనరులను సమర్థంగా వినియోగిస్తున్నందుకు సంబంధిత సిబ్బందిని అభినందించారు.వైస్ ఛాన్సలర్‌తో పాటు పరీక్షల డీన్ ఆచార్య సురేంద్ర బాబు కూడా కేంద్రాలను పరిశీలించి, పరీక్షల సజావుగా నిర్వహణకు అవసరమైన సూచనలు అందించారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా పర్యవేక్షణను మరింత బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశించారు.మొత్తం మీద యస్వీయూలో పీజీ పరీక్షలు క్రమబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. విద్యార్థుల హాజరు సంతృప్తికరంగా ఉండగా, పరీక్షలు ఎలాంటి అంతరాయాలు లేకుండా సాగుతున్నాయని అధికారులు తెలిపారు.

ముగ్గురు అంతరాష్ట్ర దొంగలు అరెస్ట్

- బొలిరో వాహనం.. టువీలర్ స్వాధీనం
- డిఎస్పీ పార్థసారథి

దొంగల అరెస్ట్ చూపుతున్న డిఎస్పీ పార్థసారథి

కుప్పం, మే 1 ప్రభాతవార్త: ఆగి ఉన్న వాహనాలను నకిలీ తాళాలతో దొంగిలించే ముగ్గురు అంతరాష్ట్ర దొ ంగలను అరెస్ట్ చేసినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి తెలిపారు. శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాళ్లబూదుగూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బొలిరో వాహనం చోరీకి గురైన కేసులో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు తాను, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు లోకేష్, వెంకట మోహన్, శ్రీకాంత్ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి వాహనాలు తనిఖీ చేయగా శుక్రవారం ననియాల - పల్లికుప్పం మార్గంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా రన్నారు. వీరిని విచారించగా వాహనాల చోరీ వెలుగుచూసిందన్నారు. తమిళనాడులోని తిరుపత్తూరుకు చెందిన ప్రభు (54), ఈరోడ్‌కు చెందిన వేలానంద్ సురేష్)23), కుప్పంకు చెందిన విజయ్‌కుమార్ మురుగేషన్ (46)లు కలసి నిలిపి ఉ ండే వాహనాలను చోరీ చేసేవారన్నారు. నిందితుల నుంచి కౌండిన్య అభయారణ్యంలో దాచి పెట్టిన బొలిరో దోస్త్ వాహనం, ఓ టువీలర్, నకిలీ తాళాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై ఇదివరకే తమిళనాడుతో పాటు కుప్పం ప్రాంతంలో సైతం చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించామన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించామన్నారు. ప్రజలు కూడా వాహనాలను ఎక్కడపడితే అక్కడ ఆపరాదన్నారు. వాహనాలకు జిపిఎస్ ట్రాకర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే ఇళ్ల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్సైలు, సిబ్బందికి రివార్డులు అందించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సైలు నరేష్, వెంకట మోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

డ్రైనేజీ దురాక్రమణపై స్థానికుల ఆగ్రహం

పాలసముద్రం, మే 1 ప్రభాతవార్త:

మండలంలోని గంగమాంబా పురం ఆది ఆంధ్రవాడులో డ్రైనేజీ ఆక్రమణలు తీవ్ర సమస్యగా మారాయి. డ్రైనేజీ కాల్వలను అక్రమంగా మూసివేయడంతో వర్షపు నీరు వెళ్ళటానికి సరైన మార్గం లేక నడివీధిలో కుంటల తలపిస్తున్నది. చాలామంది పాత ఆచార్యులు బురదలో జారీ పడిన సందర్భాలు ఉన్నాయి దీని కారణం డ్రైనేజీ దురాక్రమణ దీనిపై అధికారులకు పలుమార్లు వినతి పత్రం అందించిన అధికారులు ఏమాత్రం చలనం లేక నిమ్మకు నీరు ఎత్తినట్లు తమకేమీ సంబంధం లేనట్టు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నరని స్థానికులు ఆవేదన చెందుతున్నారు . నీరు నిలువ ఉండడంతో దుర్వాసన, దోమల సమస్య పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తే పరిస్థితి ఏర్పడుతుందని స్థానికులు అధికారులకు గుర్తు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి మీరు నిల్వ లేకుండా డ్రైనేజీ ద్వారా వెళ్లే విధంగా చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు కోరుకుంటున్నారు.

విద్యార్థులకు బహుమతులు పంపిణీ

వెదురుకుప్పం, మే 1 ప్రభాతవార్త :

మండలంలోని తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత శాతం సాధించడం పై వావిలిచేనుకు చెందిన వైసీపీ నాయకులు నరసింహా రెడ్డి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పదవ తరగతి ఫలితాలలో తిరుమలయ్యపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించడంతో పాటు వంద శాతం ఉత్తీర్ణత సాధించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడం కొరకు వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ మార్కులు సాధించిన విద్యార్థులకు 2500 రూపాయాలు, అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒకొక్కరికి 1000 రూపాయాలు అందజేయడం జరుగుతుందని ప్రకటించారు. విద్యార్థులు ప్రతిభకు కారణమైన ఉపాధ్యాయులను అభినందించారు.

కాణిపాకంలో వేసవి రద్దీ

కాణిపాకం, మే 1 ప్రభాతవార్త:

...ం శుక్రవారం వేసవి రద్దీతో పోటెత్తింది. సాధారణంగా ...ు రోజుల్లో భక్తులు రద్దీ వుంటుంది. అయితే గత కొద్ది రోజులు కావడంతో పాటు మే దే సందర్భంగా ప్రభుత్వ భక్తులు స్వామి దర్శనార్థం భారీ ఎత్తున తరలివచ్చారు. ...్నే భక్తులు కూడా ఆలయ దర్శనార్థం పెద్ద ఎత్తున నుండి రాత్రి వరకు రద్దీతో పోటెత్తింది. ఆలయంలో ...తో భక్తులు ఆలయం వెలుపల స్వామి దర్శనం కోసం గంటల తరబడి వేచి వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంద రూపాయల శీఘ్ర దర్శనం, రూ.150 శీఘ్ర దర్శనం టిక్కెట్లు తీసుకున్న భక్తులు సైతం సుమారు నాలుగైదు గంటల పాటు స్వామి వారి దర్శనం కోసం వేచి వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. రద్దీ దృష్ట్యా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు.

పెన్షన్ పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ థామస్, చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డిలు

చిత్తూరు, మే 1 ప్రభాతవార్త:

ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను జిడినెల్లూరు నియోజకవర్గం కార్వేటినగరం మండలం, టికెఎం పేటలో లబ్దిదారులకు శుక్రవారం ప్రభుత్వ విప్, జిడినెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డిలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ డాక్టర్ వీఎం థామస్, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చెక్కుడుకుప్పం షణ్ముగంరెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక పెన్షన్లను ఒకటవ తేదీ నాటికి అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కిషోరి వికాసం పోస్టర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

చిత్తూరు, మే 1 ప్రభాతవార్త:

కలెక్టర్ సుమిత్‌కుమార్ శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కిషోరి వికాసం-ప్రత్యేక వేసవి శిబిరాల కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం మే 1 నుండి జూన్ 11వ తేదీ వరకు గ్రామ, వార్డు సెక్రెటేరియేట్ స్థాయిలో జరుగుతుందన్నారు. బాలికల సాధికారత, వారి సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ఈ ప్రత్యేక వేసవి శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి వెంకటేశ్వరీ, జిల్లా బాలల రక్షణ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొటెక్షన్ ఆఫీసర్ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిలెండర్లకు అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు

– జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ వార్నింగ్

చిత్తూరు, మే 1 ప్రభాతవార్త:

దీపం-2 పథకం కింద ఎల్పీజీ సిలెండర్లకు డెలవరీ బాయ్‌లు అధిక రుసుము వసూలు చేస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, ఎక్కడైనా దీపం-2 సిలెండర్లకు అధిక రుసుం వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ కార్యాయంలోని సమావేశభవనంలో జెసి రాజేంద్రన్ శుక్రవారం గ్యాస్ పంపిణీ సంస్థలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ దీపం పథకం వినియోగదారులకు వంద శాతం సంతృప్తికరంగా సేవలు అందించాలన్నారు. దీపం-2 అమలు ఫీడ్ బ్యాక్‌లో మన జిల్లా 3వ స్థానంలో వుందన్నారు. డెలవరీ బాయ్‌లకు సంస్థ ప్రతినిధులు కౌన్సెలింగ్ నిర్వహించాలని, అక్కడక్కడ డెలవరీ బాయ్‌లు అధిక మొత్తాలు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు వున్నాయన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే గ్యాస్ పంపిణీ సంస్థలను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి వాటి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. వినియోగదారుల హక్కులు, చట్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ రాజేంద్రన్ జిల్లా పౌరసరఫరాల అధికారి శంకరన్‌ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం జెసి రాజేంద్రన్ డిస్ట్రిక్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెసి మాట్లాడుతూ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జూన్ 2026 నుండి మే 2027 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో వివిధ వినియోగదారుల సంఘాల నాయకులు, సామాజిక హక్కుల కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు హాజరై వినియోగదారులు, రేషన్‌కార్డుదారులు, సాధారణ ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలను జెసి దృష్టికి తీసుకువచ్చారు. నగర బస్టాండ్ పరిశుభ్రంగా లేదని, తగిన మరుగుదొడ్లు లేవని, పాలల్లో కల్తీ విరివిగా జరుగుతోందని, రేషన్ బియ్యం ప్రక్కదారి పడుతోందని, పెట్రోల్ బంకుల్లో వినియోగదారులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలం అవుతున్నారని, గ్యాస్ వినియోగదారుల నుండి ఏజెన్సీలు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయని సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై జెసి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టడానికి ఒక జాబ్ క్యాలెండర్‌ను సిద్ధం చేయాలని డిఎస్ఓ శంకరన్‌ను ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రతినెలా ఒకొక్క డిపార్ట్‌మెంట్‌కి సంబంధించి మెడికల్, ఎపిఎస్‌ఆర్‌టిసీ, ట్రాన్స్‌పోర్ట్, కమర్షియల్ టాక్స్, ఫుడ్‌సేఫ్టీ రకరకాల డిపార్ట్‌మెంట్లతో ప్రతి నెల ఒక అవగాహన ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచాల్సిందిగా ఆదేశించారు. అలాగే పెట్రోల్ బంకుల్లో మినిమంఫెసిలిటీస్‌వుండేలావెరిఫికేషన్‌చేయాలన్నారు. ఈసమావేశంలోసంబంధితఅధికారులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ఘనంగా చిత్రాపౌర్ణమి వేడుకలు

తవణంపల్లి, మే 1 ప్రభాతవార్త:

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం చిత్రాపౌర్ణమి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల ఆలయంలో పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ మేరకు ఆలయ ఛైర్మన్ ఎ.రఘుపతి, ఇఒ ఇ.మునిశేఖర్‌ల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం అర్చకులు స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. అలాగే ఉదయం 11 గంటలకు ఆలయంలో సుదర్శన హోమం, ఆకు పూజ కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

జనాభా లెక్కల ప్రక్రియ ప్రారంభం

గుడిపాల, మే 1 ప్రభాతవార్త:

మండలంలోని బసవపల్లి పంచాయతీ కోలావూరు గ్రామంలో శుక్రవారం జనాభా లెక్కల ప్రక్రియను జిజెఎం ట్రస్ట్ ఛైర్మన్ చెన్నకేశవనాయుడు, తహసిల్దారు శ్రీనివాసులు, ఎంపిడిఓ గౌరీలు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు మండల వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఇంటింటికి వెళ్ళి కుటుంబ సభ్యుల వివరాలు, ఇంటి స్థితి తదితర అంశాల వివరాలను ప్రజల నుండి సేకరించి నమోదు చేయడం జరుగుతుందన్నారు. జనగణన డేటా పూర్తిగా డిజిటల్ విధానంలో నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దారు వెంకటరమణ, ఎఎస్ఓ వేణుగోపాల్, మండల దేశం మహిళా అధ్యక్షురాలు ఉదయ మధుసూధన్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, ఏప్రిల్ 30 ప్రభాతవార్త :

కార్మికుల సంక్షేమమే కూటమి ప్రభుత్వలక్ష్యమని, కార్మికుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారనీ ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం మే డేను పురస్కరించుకొని నియోజకవర్గంలోని వివిధ కార్మిక సంఘాల, టిఎన్‌టియుసి, తెదేపా నాయకుల ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికులు ఎమ్మెల్యేతో కలసి కలెక్టరేట్ నుంచి ద్విచక్ర వాహనాల ర్యాలీగా పిసిఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశానికి హాజరయ్యారు. కార్మికులు ఎమ్మెల్యేను గజమాలతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్మికులు దేశాభివృద్ధికి ఎంతో కీలకమని, ప్రస్తుతం దేశంలో అగ్రగామిగా వున్న సంస్థలన్నీ నాడు కార్మికుల చేత స్థాపించబడినదేనన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు కూడా కార్మికులేనని, వారి సంక్షేమం కోసం రాష్ట్ర మంత్రి నారాలోకేష్ ఆలోచించి రూ.5లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించారన్నారు. అనంతరం గుర్తింపు పొందిన కార్మికులకు కార్మికశాఖ ఆధ్వర్యంలో గుర్తింపుకార్డులను పంపిణీ చేసి, కార్మికులకు దుస్తులు, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మెన్ త్యాగరాజన్, ఎంపిపి గోళ్ల హరి, మాజీ మేయర్ అముద, రాజేష్‌కుమార్‌రెడ్డి, లోకేష్, జి సురేష్, గాంధీ. నరేష్, కూటమినాయకులు, వివిధ కార్మిక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీరించిన ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, మే 1 ప్రభాతవార్త:

చిత్తూరునగరం, ఎమ్మెల్యే కార్యాలయం ప్రజాదర్బార్ నందు శుక్రవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యలను క్షేత్రస్థాయిలో విచారించి వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్లహరి, ఎంపిడివోలు శిరీష, శ్రీనివాసఉలు, మున్సిపలల్ డిఈ రమణ, హౌసింగ్ డిఈ శ్రీధర్, డిప్యూటీ తాహసిల్దార్లు ఇబ్రహీం, వెంకటరమణ, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కార్పెంటర్ వర్కర్ల భారీ స్కూటర్ ర్యాలీ

చిత్తూరురూరల్, మే 1 ప్రభాతవార్త:

చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్‌మోహన్ మేడే వేడుకల్లో భాగంగా జిల్లా కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ నిర్వహించిన ద్విచక్రవాహన ర్యాలీలో పాల్గొన్నారు. కార్మికులతో కలసి కలెక్టరేట్ నుంచి పిసిఆర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై భారీ కేక్ కట్ చేసారు. అనంతరం కార్మికులకు దుస్తులు, గుర్తింపుకార్డులను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్య,అధ్యక్షుడు కెజి మురళీ, కార్యదర్శి కుమరేష్,జాయింట్ సెక్రటరీ మదర్‌అలీ, ట్రెజరర్ రాజేంద్రాచ్చారి, సభ్యులు చంద్రశేఖర్, మోహన్, సురేష్, నరసింహలతో పాటు కార్మిక సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

పూతలపట్టు, మే 1 ప్రభాతవార్త:

కార్మికులు తమ హక్కుల కోసం రక్తం చిందించి పోరాడి సాధించిన రోజు మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కృషి, స్ఫూర్తి అని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుంటూరు మురళి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలామంది మే డే అంటే కేవలం 1886 నాటి షికాగో పోరాటం గా మాత్రమే భావిస్తారు. భారతదేశ కార్మికులకు అంబేద్కర్ అందించిన చారిత్రక వరాలు తెలిపారు.

గణాంకాల ప్రారంభం

పూతలపట్టు, మే 5 ప్రభాతవార్త:

2026 గణాంకాల గణనలో పుతాలపట్టు మండలం వాస్తవిక ఇళ్ల లిస్టింగ్ వివరాలు పొందుపరచబడుతున్నాయని తహశీల్దార్ రమేష్ బాబు తెలిపారు. ఈసారి గణాంకాల్లో ప్రతి ఇంటిని లెక్కిస్తారు, వీటిలో ప్రతి ఇల్లు వ్యక్తిగత వివరాలు, కుటుంబాల సంఖ్య, ఇతర సామాజిక ఆర్థిక పరిస్థితులును నమోదు చేయడమైంది. ఈ గణాంకాలు స్థానిక ప్రభుత్వం, గృహ అభివృద్ధి ప్రణాళికలు, మరియు బడ్జెట్ ప్రణాళికలు తయారీలో ఉపయోగపడతాయి. ప్రజలు తమ ఇళ్ల వివరాలు సమయానికి సరిగా అధికారులకు అందజేయాలని పూతలపట్టు తహసిల్దార్ రమేష్ బాబు కోరారు.

ఘనంగా శ్రీరాములవారి రథోత్సవం

కుప్పం, మే 1 ప్రభాతవార్త:

స్థానిక శ్రీ రాధాకృష్ణరోడ్‌లో వెలసిన శ్రీ రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరాములవారి రథోత్సవంను కన్నులపండువగా నిర్వహించారు. ఈసందర్భ ంగా స్వామిఅమ్మువారిని విశేషంగా అలంకరించి రథంపై ఊరేగించారు. మొక్కులు కలిగిన భక్తులు రథంపై మిరియాలు, చిల్లర నాణేలు, అరటిపళ్లు చల్లి మొక్కులు తీర్చుకున్నారు. రథం ముందర కోలాట, సేవాగాళ్ల ఆటలను నిర్వహించారు. రాత్రి ధూళి ఉత్సవం జరిగింది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేదల కళ్లల్లో ఆనందం నింపిన సిఎం చంద్రబాబు

– ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, మే 1 ప్రభాతవార్త:

ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల ద్వారా పేదల కళ్లల్లో సిఎం చంద్రబాబు నాయుడు ఆనందం నింపారని ప్రభుత్వవిప్, కడ పిఎసి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా కుప్పం పట్టణంలో ఆయన లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, కౌన్సిలర్లు సోమశేఖర్, జిమ్‌దాము, రాష్ట్ర నేత గోపీనాథ్, ఆర్ఆర్ రవి, శ్యాంసుందర్, నాను, ఉమేర్ ఖాన్, ముజీబ్, గీతమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు

- ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, మే 1 ప్రభాతవార్త :

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అర్హులందరికీ పెన్షన్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బిరుదనపల్లిలో ఆయన పెన్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతోష్,స్థానిక నేతలు పాల్గొన్నారు.

సేంద్రీయ ఎరువుల వాడకం శ్రేయస్కరం

శాంతిపురం, మే1 ప్రభాతవార్త:

రైతులు పంటలకు సేంద్రీయ ఎరువులు వాడితే పంటల దిగుబడి నాణ్యతతో వస్తుందని ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం రాళ్లబూదుగూరులో సేంద్రీయ ఎరువుల తయారీ కేంద్రంను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛరథం ద్వారా ప్రజల ఇళ్ల నుంచి తడి,పొడి, ప్రమాదకర చెత్తలు సేకరిస్తున్నట్లు తెలిపారు. తడి చెత్తను సేంద్రీయ ఎరువుగా మార్చడం జరుగుతోందన్నారు. మండలంలో ఇప్పటికే 12 పంచాయతీల్లో సేంద్రీయ ఎరువుల కేంద్రాలు ఉన్నాయన్నారు. మిగతా 11 పంచాయతీల్లోను సేం ద్రీయ ఎరువుల తయారీ ప్రారంభిస్తామన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు, నీటి ట్యాంకులు, కాలువలు శుభ్రం చేసినట్లు తెలిపారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

ఘనంగా మేడే వేడుకలు.

శాంతిపురం, మే 1 ప్రభాతవార్త :

మండల కేంద్రమైన శాంతిపురంలో శుక్రవారం ఘనంగా మే డే వేడుకలను నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద శ్రీ వినాయక ఆటో యూనియన్ వారి ఆధ్వర్యంలో మేడే వేడుకలు జరిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉదయ్ కుమార్ నాయుడు, మాజీ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ కార్మిక సోదరులకు మేడే పండుగ లాంటిదని పేర్కొన్నారు కార్మికులకు తాము ఎప్పుడు అండగా ఉంటామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఆటో కార్మికులను ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో ఆటో కార్మికుల తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

రాతి మహాద్వార నిర్మాణానికి భూమి పూజ

కుప్పం,మే 1 ప్రభాతవార్త :

కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ సమీపంలో రాతి మహా ద్వార నిర్మాణానికి శుక్రవారం ప్రభుత్వ విప్ ,కడపిఎ సి ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ఎదుట భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకుగాను దాతలు అందించిన విరాళాలతో ఇటీవల స్థలాన్ని కొనుగోలు చేశారు .ఆ స్థలం వద్ద మహా ద్వారం నిర్మాణానికి సంబంధించి భూమి పూజ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పి కే ఎం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, కడ సభ్యుడు రాజ్ కుమార్, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్ ,రాష్ట్ర నేత గోపీనాథ్ ,మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు .

ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు

కుప్పం, మే 1 ప్రభాతవార్త:

ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను శుక్రవారం కుప్పం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చంద్రన్న కార్మిక భవనం వద్ద నుంచి బస్టాండ్ మీదుగా శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం వరకు కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రభుత్వ విప్ ,కడ పీఏసీ ఛైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ప్రారంభించారు. బాణాసంచా పేలుళ్లు, డప్పు వాద్యాల నడుమ భారీగా ర్యాలీ కొనసాగింది. అనంతరం అన్నదానం జరిపారు. కార్యక్రమంలో పి కే యం యుడా ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు , టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారామ్, కడ సభ్యుడు రాజ్ కుమార్ ,కార్మిక సంఘం అధ్యక్షుడు శివకుమార్ ,మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మున్సిపల్ అధ్యక్షుడు కానిపాకం వెంకటేష్,రాష్ట్ర నేత గోపీనాథ్, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సత్యేంద్ర శేఖర్ , కార్మిక నాయకులు నాగరాజు, హరి, ఇస్మాయల్,సలామత్,మునాఫ్ వివిధకార్మికసంఘాలనాయకులు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మేడే సందర్భంగా కమ్యూనిస్టుల ర్యాలీ.

బైరెడ్డిపల్లి,మే1 ప్రభాతవార్త:

బైరెడ్డిపల్లిలో మేడే సందర్భంగా వామపక్షాల నాయకులు,కార్యకర్తలు భారీ ర్యాలీని నిర్వహించారు. ఏఐటియుసి, సిఐటియుసి ఐ ఎఫ్ టియు లు సంయుక్తంగా నిర్వహించినటువంటి ఈ ర్యాలీని చెక్ పోస్ట్ కూడలి నుండి మెయిన్ రోడ్ లక్కనపల్లి రోడ్డు ద్వారా నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా సచివాలయం ఎదుట నిర్వహించినటువంటి సభలో సంఘ సభ్యులు అంగన్వాడీ కార్యకర్తలు. వివిధ సంఘాల కర్షక కార్మికులు మేడే ను పురస్కరించుకొని ప్రసంగించడం జరిగినది.

ఘనంగా కార్మికుల దినోత్సవం

రామకుప్పం, మే 1 ప్రభాతవార్త:

కార్మికుల దినోత్సవాన్ని రామకుప్పంలో కూట మి నేతలు, పెయింటర్లు, మేస్త్రీలు, హమాలి కూలీలు, కార్పెంటర్లు తదితరులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం స్థానిక బందార్లపల్లి క్రాస్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ దివంగత నేత డాక్టర్ రాజన్ కుటుంబీకులు పంచాయతీ కార్మికులకు వస్త్ర దానం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేత మునస్వామి, టిడిపి మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనందరెడ్డి,ఆంజనేయరెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు నరసింహులు, రామ్మూర్తి, గుర్రప్ప, జయశంకర్,విశ్వనాథ్, రవి రెడ్డి, విజయ్ కుమార్, రామలింగారెడ్డి, బాలరాజు , సుబ్రి ,ఆదిల్, మంజునాథ్, కేశవరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.

పెయింటింగ్ కార్యవర్గం ఏకగ్రీవం

రామకుప్పం, మే 1 ప్రభాతవార్త :

రామకుప్పం మండల పెయింటింగ్ కార్యవర్గంను ఏకగ్రీవం ఎన్నుకున్నారు. శుక్రవారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా రాంప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా విశ్వ, వేలు, కృష్ణ కార్యవర్గ సభ్యులుగా ఎనుకున్నారు. కార్మికుల ఐక్యతతో సమస్యల పరిష్కారానికి కార్యవర్గ సభ్యులు ముందుంటామన్నారు.

పంటలపై ఏనుగుల దాడులు

రామకుప్పం, మే 1 ప్రభాతవార్త:

మండలంలోని రామాపురం తండా, పంద్యాల మడుగు, పీఎంకే తండా, జీడిమాకులపల్లి గ్రామాల్లో రైతుల పండిస్తున్న పంటలపై ఏనుగులు దాడులు చేసి బీభత్సం సృష్టించాయి. గురువారం రాత్రి గుంపు ఏనుగులు, జంట ఏనుగులు విడివిడిగా టమోటా, మామిడి,వరి, టెంకాయ చెట్లు ఇతర పంటలపై దాడి చేసి రైతులకు అపార నష్టం కలిగించాయి. వరుస ఏనుగు దాడులతో రైతన్నలు భయాందోళనకు గురవుతున్నారు. పంట నష్టాన్ని అందించాలని రైతుల కోరుతున్నారు. అటవీ గ్రామాల రైతులు తమ పంట పొలాల వైపు వెళ్ళవద్దని అటవీ అధికారులు తెలిపారు. ఏనుగుల సమాచారం తెలిస్తే అటవీసిబ్బందికి తెలపాలన్నారు.

కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసిన బిజెపి నేతలు

రామకుప్పం, మే 1 ప్రభాతవార్త:

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి, తనయుడు నిఖిలేష్ రెడ్డిని బిజెపి నేతలు కలిశారు. శుక్రవారం కిరణ్ కుమార్‌రెడ్డి సొంత గ్రామమైన కలికిరిలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. స్థానిక రాజకీయ పరిస్థితుల గురించి ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు రాణి జనార్దన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి నాగరాజు రాష్ట్ర నేత ఆంజనేయప్ప, జిల్లా నేత రాజసింహ మాజీ రెస్కో డైరెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి ఫించన్ల పంపిణీ

చిత్తూరురూరల్, మే 1 ప్రభాతవార్త:

చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ఆదేశాల మేరకు శుక్రవారం కూటమి నాయకులు ఇంటింటికి వెళ్లి ఫించన్లను పంపిణీ చేసారు. ఈ క్రమంలో 32వ డివిజన్‌లో టిడిపి అధ్యక్షురాలు హేమావతి సచివాలయ స్బింది, టిడిపి కూటమి నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా ఫించన్లను పంపిణీ చేసారు. డివిజన్ పరిధిలో ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొని వస్తే ఆ సమస్యలను శాసనసభ్యులు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌లో తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు అడ్మిన్ కార్యదర్శి యోగేశ్వర్, దీప్, హరిక్రిష్ణ, దేవేంద్ర, సచివాలయ సిబ్బందితో పాటు నాయకులు రవికుమార్ త్రిమూర్తి నాయుడు, కరీం, లవకుమార్, సోమశేఖర్, మలర్‌విజయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే 37వ డివిజన్‌లో వృద్దులకు, వితంతువులకు, వికలాంగు లకు మాజీ డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యంతో కలసి వార్డు భాజపా ఇన్‌ఛార్జీ జి షణ్ముగం ఇంటింటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా ఫించన్లను అందజేసారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు ఉపాధి కూలీ మృతి

రైల్వే కోడూరు,రూరల్ మే1 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు మండలంలోని ఎస్ కొత్తపల్లి గ్రామపంచాయతీకి చెందిన శ్రీనివాసపురం ఉపాధి హామీ పనులు పనిచేస్తున్న కూలీ తురక నాగమణి అనే మహిళ శుక్రవారం ఉపాధి హామీ కూలీ పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న సందర్భంలో ఎండ దెబ్బకు కుప్పకూలిపోయిందని గ్రామస్తులు తెలిపారు. అయితే తురక నాగమణి నేలపై పడిన సందర్భంలోనే మిగతా కూలీల వారు హుటాహుటిన కోడూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్: రూపానంద

రైల్వే కోడూరు రూరల్, మే 1 ప్రభాతవార్త:

రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బారు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి ఇన్చార్జ్ ముక్కారూపానంద రెడ్డి తెలియజేశారు. శుక్రవారం రైల్వే కోడూరు మండలంలోని రాఘవ రాజాపురం టిడిపి కార్యాలయము నందు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూపానందరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి సమస్యలను చెప్పుకునేందుకు భారీగా జనాలు తరలివచ్చారని విచ్చేసిన ప్రజలంతా తమ సమస్యలను అర్జీల రూపంలో తమకు అందజేశారని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు ఎక్కువగా వచ్చాయని దీనిపట్ల సంబంధిత అధికారులు చొరవ చూపి సమస్యలకు పరిష్కార వేదికను చూపించాలని ఆయన అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా ప్రజా దర్బార్ ఏర్పాటు చేశారని ప్రతి చిన్న సమస్యను వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి వెంటనే పరిష్కారాన్ని చూపించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు కమతం నాగరాజు, చంద్రశేఖర్ రాజు, తల్లెం రమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, తిప్పన రాజశేఖర్, పసుపులేటి జై చంద్ర, ఆకేపాటి సుకుమార్ రెడ్డి, ముని పెంచల్ రెడ్డి, పరుశరామిరెడ్డి, సుంకేసుల రెడ్డి బాబు, సుబ్రహ్మణ్యం నాయుడు, తిరుపతి శేఖర్ తోపాటు ఎన్డీఏ కు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ బైక్స్‌తో ఇంధన ఖర్చుకు స్వస్తి

చిట్వేలి, మే 1, ప్రభాతవార్త:

ఎలక్ట్రికల్ బైక్స్ వాడకంతో రోజురోజుకు పెరుగుతున్న ఇంధన ఖర్చుకు పూర్తి స్వస్తి చెప్పవచ్చని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై వినోద్ కుమార్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పర్యావరణ పరిరక్షణకు కీలకంగా మారిందని వారు అభిప్రాయపడ్డారు. శుక్రవారం చిట్వేలిలో శ్రీ సద్గురు ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చిన "బ్రిగేడర్" ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్ మోడల్‌ను వారు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఇప్పటివరకు మార్కెట్‌లో ఎక్కువగా స్కూటీ మోడళ్లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇప్పుడు మోటార్‌సైకిల్ మోడల్ రావడం యువతలో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోందని పేర్కొన్నారు.ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో నెలకొన్న యుద్ధ పరిస్థితులు, ఇంధన సంక్షోభం కారణంగా డీజిల్, పెట్రోల్ ధరలు సామాన్యులకు భారంగా మారాయని అన్నారు. ఇలాంటి సమయంలో ఎలక్ట్రిక్ బైక్‌లు ప్రజలకు ఆర్థికంగా ఉపశమనం కలిగించే ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా శ్రీ సద్గురు ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన ఈ బైక్స్ సేల్స్ అండ్ సర్వీసెస్ మేనేజింగ్ పార్ట్నర్లు గోపి దేశి ప్రసాద్, భాను ప్రకాష్ చౌదరి, పిడుగు ప్రసాద్‌లను అధికారులు అభినందించారు. పర్యావరణ హిత వాహనాల ప్రోత్సాహంలో సంస్థ చేస్తున్న కృషికి తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.

వెంకటేష్ ఆచూకీ తెలిలపండి

ఓబులవారిపల్లి మే 1 ప్రభాతవార్త :

ఓబులవారిపల్లి మండలం ఐలరాజు పల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ అనే వ్యక్తి ఊరికి వెళ్లి వస్తానని బుధవారం సాయంత్రం ఇంటి నుండి బయలుదేరి ఆ తర్వాత ఇంటికి రాలేదని బంధువులు తెలిపారు నల్లగల్ల ములుగు ప్యాంటు ఐదు పాయింట్ రెండు అంగుళా లు ఎత్తు ఉన్నాడని ఎవరైనా ఆశికి తెలిపిన వారికి నగదు బహుమతి కూడా ఇవ్వబడునని బంధువులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే 9672054483 ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి ఆచూకీ తెలపాలన్నారు కనిపించలేదని ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేశామన్నారు.

మసకబారుతున్న బాల్యం!

-బడి ఈడు పిల్లను బడిలో చేర్పించండి -బాల కార్మిక వ్యవస్థను రద్దు చేయండి

ఓబులవారిపల్లి మే 1 ప్రభాతవార్త:

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఒక్కరు బాగా చదువుకోవాలని విద్యకు అధిక ప్రాధాన్య తీస్తూ కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ. కొన్నిచోట్ల బాల్యం మసకబారుతుంది చదివిడి పిల్లలు బడికి వెళ్లాల్సిన వారు బాల కార్మికులుగా తయారై. బాల్య జీవితాన్ని నిర్భరమైన జీవితాన్ని గడుపుతూ ఎండనక వాననక గాలినక కనీసం కాళ్లకు చెప్పులు కూడా లేకుండా చిత్తు కాగితాలు వాటర్ బాటిళ్లు ప్లాస్టిక్ సంచులు ఏరుకుంటూ మండుటెండలో పేదరికం అనుభవిస్తూ చదువుకు దూరం అవుతుంటే వారిని చూసిన ప్రతి ఒక్కరు ప్రశ్నించక మానలేదు ఇప్పటికైనా బాలకర్మికులను నిర్మూలించి సంబంధిత అధికారులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించి వారికి ఉన్నత విద్యను అందించాలని అలాగే పిల్లల తల్లిదండ్రులకు వాళ్ళ పేదరికం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించి పేద పిల్లలను బాగా చదివించాలని పలువురు అధికారులను కోరుతున్నారు

మండలంలో పింఛన్ల పంపిణీ

రేణిగుంట, మే 1 ప్రభాతవార్త: మే డే ప్రపంచ కార్మికుల దినోత్సవం అయినప్పటికీ ప్రభుత్వ అధికారులు శుక్రవారం ఉదయం లబ్ధిదారులందరికీ తెలుగుదేశం నేతలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అయిన ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఉదయం నుండి పంపిణీ ప్రక్రియ నిర్విఘ్నంగా జరిగింది. లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు. రేణిగుంట పట్టణంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రభు రావు ఆధ్వర్యంలో టిడిపి నేతలైన క్లస్టర్ ఇంచార్జ్ డి పుష్పనాదం, మైనార్టీ నాయకులు నవాబు, టిడిపి పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట మండలంలో ఇతర పంచాయతీల్లో ఎంపీడీవో రవిచంద్ర ఆయా పంచాయతీల, కార్యదర్శులు టిడిపి నేతలతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. రేణిగుంట మండలం జి పాలెం పంచాయితీ పద్మా నగర్ లో స్థానిక టిడిపి సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అగ్రహారం నందు సింగిల్ విండో అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, అన్నసంపల్లి నందు టిడిపి యూనిట్ ఇంచార్జ్ ముచ్చెలి భాస్కర్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు కాపా రెడ్డి నాదముని రెడ్డి, తూకివాకం నందు టిడిపి సీనియర్ నేత మాజీ సర్పంచ్ భాస్కర్ రెడ్డి, గాజులమండ్యం ప్రాంతంలో టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, ఎల్లమండ్యం పంచాయతీలో తిరుపతి టిడిపి పార్లమెంటరీ అధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి అధికారులతో దగ్గరుండి పింఛన్లు పంపిణీ చేయించారు.

జనగణన పై అపోహలు వద్దు : తహసిల్దార్

రేణిగుంట,మే 1 ప్రభాతవార్త :

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయు క్తం గా చేపట్టిన జన గణన పై ఎలాంటి అపోహ లకు తావివ్వ కుండా ప్రజలంతా స్వచ్ఛందంగా జనగ ణన లో భాగస్వామ్యం కావాలని రేణిగుంట తహసిల్దార్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. రేణిగుంట మండలంలో ప్రభుత్వ ఆదేశాలు మేరకు పట్టణంలోని గౌరీ నగర్, వినాయక నగర్ ప్రాంతాలలో శుక్రవారం రెవెన్యూ, మండల అభివృద్ధి, పోలీస్ అధికారులు సంయుక్తంగా తహసిల్దార్ ఆధ్వర్యంలో జన గణన చేశారు. ఇంటింటికి తిరిగి జనగణనను చేపట్టారు. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ జనగణన చేసుకోవడం వల్ల ప్రభుత్వం నుండి వచ్చే రాయితీలు రావని అపోహలు వద్దన్నారు. మే 1 తేదీ నుండి 30 తేదీ వరకు జనగణన కోసం వచ్చే అధికారులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవిచంద్ర, అర్బన్ సీఐ జయచంద్ర, అధికారులు పాల్గొన్నారు..

ఆటో కార్మికులు నిబంధనలు పాటించాలి.!

చంద్రగిరి, మే 1 ప్రభాతవార్త:

ఆటో కార్మికులు నిబంధనలు పాటించాలని సిఐ సురేష్‌కుమార్ అన్నారు. కార్మిక దినోత్సవాన్ని (మే డే) పురస్కరించుకుని శుక్రవారం బస్టాండ్ వద్ద శ్రీ మూలస్థాన ఎల్లమ్మ ఆటో యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సిఐటియుసి ఆధ్వర్యంలో నిర్వహించిన మే డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగివుండాలనీ, మత్తుపదార్థాలను సేవించి ఆటో నడపవద్దని హితవు పలికారు.ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీరాములు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అనేక అదనపు భారాలను మోపుతున్నట్లు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మురళీమోహన్, యూనియన్ నాయకులు టి.రవిచంద్రన్, కె.బాలకిషోర్, పి.రామారావు, పరందామరెడ్డి, వాసు, సురేష్, ఖాదర్ భాషా, మోహన్‌రెడ్డి, ఏఐటియుసి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెవై రాజా, సంఘ మహిళలు పాల్గొన్నారు.

తారు రోడ్డుకి1.15కోట్లు మంజూరు

-యస్‌టి కాలనీకి ఇచ్చిన హామిని నేరవేర్చిన ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నింద్ర,మే 1 ప్రభాతవార్త : 2024వ సంవత్సరంలో ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మండలంలోని మేళంబాకం గ్రామ పంచాయతీ, కన్నికాపురం యస్‌టి కాలనీలో ఎన్నికల ప్రచార సమయంలో కాలనీ వాసులకు తాను గెలుపొందిన తరువాత తారురోడ్డ ఏర్పాటు చేస్తానని హామిని నిలబెట్టుకున్నారు.గతంలో తమ కాలనీకి తారురోడ్డు ఏర్పాటు చేయాలని చాలా మంది ప్రజాప్రతినిదులును వేడుకున్న ఎవరు కూడా పట్టించుకోలేదు. గతంలో ఇచ్చిన హామిని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కన్నికాపురం యస్‌టి కాలనీ తారురోడ్డుకి 1.15కోట్లు మంజూరు చేసారు. తమ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించడంతో యస్‌టి కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేసారు.

సంఘమిత్రలకు అందుబాటులో సాంకేతికత : ఎంఎల్‌ఏ

చంద్రగిరి, మే 1 ప్రభాతవార్త:

సాంకేతికతను సంఘమిత్రలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకై కూటమి ప్రభుత్వం 5 జి మొబైల్ ఫోన్లు అందిస్తున్నట్లు ఎంఎల్‌ఏ పులివర్తి నాని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలోని సంఘ మిత్రలకు శుక్రవారం చంద్రగిరిలో ఆయన 5జి మొబైల్ ఫోన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కూటమి ప్రభుత్వం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పరిధిలో పనిచేస్తున్న సంఘమిత్రలకు 5జి మొబైల్ ఫోన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధిలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర వ్యాప్తంగా గల 28,500 మంది సంఘమిత్రలకు 5జి మొబైల్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని 286 మంది సంఘమిత్రలకు 5జి ఫోన్లు అందజేయడం జరిగిందన్నారు.

కార్మికుల సంక్షేమానికి సంఘం అండగా ఉంటుంది

రేణిగుంట, మే 1 ప్రభాతవార్త :

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి భవన నిర్మాణ కార్మిక సంఘం అండగా ఉంటుందని అధ్యక్షుడు మహమ్మద్ రసూల్ అన్నారు. రేణిగుంట బస్టాండ్ వద్ద మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం దాదాపు 210 మంది కార్మికులకు ఉచితంగా ఇన్సూరెన్స్ పాలసీలు నమోదు చేశారు. ముందుగా మే డేని పురస్కరించుకొని జండా ఎగరవేసి ఆ తరువాత రేణిగుంట పట్టణంలో కార్మికులంతా పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన సభలో పలువురు భవన నిర్మాణ కార్మికులకు సన్మానాలు చేశారు. అనంతరం భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మహమ్మద్ రసూల్, సలహాదారు తులసి రాజన్, ఉపాధ్యక్షులు నాగరాజు, ట్రెజరర్ డిపి నాయుడు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు ఓ వి రమణ తదితరులు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల గుర్తింపు కోసం కార్మికులు ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. మేడేని పురస్కరించుకొని మరో 210 మంది పేర్లను ఇన్సూరెన్స్ పాలసీలో నమోదు చేశామని చెప్పారు. వీరందరికీ సంఘమే ప్రీమియం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమం చివర్లో భవన నిర్మాణ కార్మికులందరికీ భోజనాన్ని ఏర్పాటు చేశారు.

మే డే సందర్భంగా రెపరెపలాడిన అరుణ పతాకాలు

రేణిగుంట, మే 1 ప్రభాతవార్త :

మే డే ని పురస్కరించుకొని రేణిగుంట మండలంలో పలు ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ, సిఐటియు, ఏఐటీయూసీ నేతలు ఎర్రజెండాలను ఎగురవేసి లాల్ సలాం చెప్పారు. మండలంలోని అన్ని కర్మాగారాల వద్ద, కంపెనీల వద్ద, ఆటో, టాక్సీ, స్టాండ్, సి ఆర్ యస్, రైల్వే స్టేషన్ మజ్దూర్ యూనియన్ కార్యాలయాల వద్ద ఎర్రజెండాలు రెపరెపలాడాయి. రేణిగుంట మండలం మే డే సందర్భంగా అరుణ వర్ణంగా మారింది. ఎర్రజెండాలు ఆవిష్కరించిన వారిలో సిపిఎం నాయకులు ఓ వి రమణ, హరినాథ్, సెల్వరాజ్, తదితరులు, సిపిఐ నేతలు వైయస్ మణి, కార్తీక్ మొదలైన వారు పాల్గొన్నారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి!

రేణిగుంట మే 1 ప్రభాతవార్త :

రేణిగుంట మండలం గుత్తి వారి పల్లి సర్వీస్ రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుమారు 50 సంవత్సరాల వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ట్రాక్టర్ తొట్టె నందు ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుత్తివారిపల్లి వద్ద ట్రాక్టర్ స్పీడ్ బ్రేకర్ ఎక్కి దిగడంతో ఏర్పడిన కుదుపు వల్ల ట్రాక్టర్ తొట్టె నుండి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు పోలీసులు సంఘటనా స్థలం చేరుకొని మృతదేహాన్ని స్వాధీనపరచుకొని శవ పరీక్ష నిమిత్తం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

తిరుపతి డివిజన్

పదిలో రెడ్ చెర్రీస్ విద్యార్థులు విజయదుందుభి

తిరుపతి విద్య,మే 1 ప్రభాతవార్త :

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో రెడ్ చెర్రీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి విజయదుందభి మోగించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మా విద్యార్థులు ఈ ఏడాది అద్భుతమైన ఫలితాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉంది. ఎన్. దీక్షి తారెడ్డి, ఎస్. దీక్షి త ఇద్దరూ 596 మార్కులు సాధించి స్కూల్ టాపర్స్‌గా నిలవడం గర్వకారణం. అలాగే పి. రెడ్డి యువ దీప్తి 595 మార్కులతో ద్వితీయ స్థానం, కె.ఇశాంత్ కృష్ణ, పిఎం. నూతన చెర్రీస్, శ్రీనివాస లిఖిత్ 593 మార్కులతో తృతీయ స్థానం సాధించడం విశేషం, అని తెలిపారు.590కి పైగా 14 మంది, 580కి పైగా 41 మంది, 550కి పైగా 100 మంది, 500కి పైగా 160 మంది విద్యార్థులు మార్కులు సాధించడం మా పాఠశాల విద్యా ప్రమాణాలకు నిదర్శనం. విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయి అని పేర్కొన్నారు.పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో సోక్రటీస్ విద్యార్థుల సత్తా

తిరుపతి విద్య, మే 1 ప్రభాతవార్త :

నగరంలోని సోక్రటీస్ ఐకాన్ ఐఐటి ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విశేష ప్రతిభ కనబరిచారు అని పాఠశాల కరస్పాండెంట్ కరస్పాండెంట్ కె. ప్రదీప్ రెడ్డి వెల్లడించారు.జి. శ్రీ లక్షి మ్ నైనిక 572 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి పాఠశాలకు గౌరవం తీసుకువచ్చింది. యం. హర్షిత 565 మార్కులతో ద్వితీయ స్థానం, పి. మేఘన 522 మార్కులు, యస్. అక్షయ 520 మార్కులతో మెరుగైన ఫలితాలు సాధించారు. అదేవిధంగా 500కు పైగా మార్కులు సాధించిన 15 మంది విద్యార్థులు, 480కు పైగా మార్కులు సాధించిన మరో ముగ్గురు విద్యార్థులు ప్రతిభను చాటుకున్నారు.ఈ విజయాలు విద్యార్థుల కష్టపడి చదివే తత్వం, పట్టుదలతో పాటు పాఠశాల అందిస్తున్న నాణ్యమైన బోధనకు నిదర్శనంగా నిలిచాయని ప్రదానోపాధ్యాయులు పేర్కొన్నారు. పాఠశాలలో అమలు చేస్తున్న ప్రత్యేక శిక్షణా విధానాలు, నిరంతర మూల్యాంకనం, వ్యక్తిగత దృష్టి వంటి అంశాలు మంచి ఫలితాలకు దోహదపడ్డాయని తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు , కరస్పాండెంట్ కె. ప్రదీప్ రెడ్డి కలిసి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

జి.ఎస్.ఆర్ మాగ్నెట్ పాఠశాల ప్రభంజనం

తిరుపతి విద్య, మే 1 ప్రభాతవార్త :

2025-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్.ఎస్.సి పరీక్షల్లో తిరుపతిలోని జి.ఎస్.ఆర్ మాగ్నెట్ పాఠశాల అత్యుత్తమ ఫలితాలను సాధించింది. ఈ పరీక్షలకు హాజరైన మొత్తం 53 మంది విద్యార్థుల్లో అందరూ ఉత్తీర్ణత సాధించడం విశేషం. వారిలో 47 మంది ప్రథమ శ్రేణిలో, 6 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై పాఠశాల వంద శాతం ఫలితాలను నమోదు చేసింది.ఈ ఫలితాల్లో ప్రత్యేకంగా నిలిచింది పి. జెష్మిత. ఆమె 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం పొందడం పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. ఆమె కృషి, పట్టుదల ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తోంది.ఈ అద్భుత విజయానికి విద్యార్థుల శ్రమతో పాటు ఉపాధ్యాయుల నిబద్ధత, పాఠశాల యాజమాన్యం తీసుకున్న ప్రణాళికలు, తల్లిదండ్రుల సహకారం కీలక పాత్ర పోషించాయి. ఈ విజయంతో పాఠశాల మరింత ఉన్నత లక్ష్యాల దిశగా ముందుకు సాగుతోంది.ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులందరికీ అభినందనలు తెలుపుతూ, వారికి మార్గదర్శకులైన ఉపాధ్యాయులు, యాజమాన్యం, తల్లిదండ్రులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పది ఫలితాలలో విశ్వం ప్రభంజనం

తిరుపతి విద్య, మే 1 ప్రభాతవార్త:

పది ఫలితాలలో విశ్వం విద్యాసంస్థల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారు. టి.శ్రీదర్శిని 600/587 మార్కులు సాధించి ప్రతిభచాటారు. ఏ.త్రినాథ్, ఎం.చరణ్, వర్ధన్, విక్రమ్, జాయ్ జాస్మిన్, దినేష్ 550కు పైగా మార్కులు సాధించగా, గగన్ హర్ష, పవన్, ఉజ్వల శివ, గణేష్, శ్రావ్య విద్యార్థులు 540కు పైగా మార్కులు సాధించారు. చైతన్య నాయక్, సిద్ధార్థ, నవనీష్, ఈగేష్, సుజన్, ధోనీష్, పద్మిని, ఇందు, యుగేష్, బేబీ అక్షయ, అమర్ రాజు, మమత 500కు పైగా మార్కులు సాధించి సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచారు.ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ విశ్వం విద్యా సంస్థలు కేవలం సైనిక్ స్కూల్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ ప్రవేశ పరీక్షల కోచింగ్‌కే పరిమితం కాకుండా, పాఠశాల విద్యలో కూడా అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా ముందుకు సాగుతుందని తెలిపారు. తమ విద్యార్థిని అంతర్జాతీయ చెస్ క్రీడాకారిని కావడం తమ సంస్థలో అకడమిక్‌తో పాటు క్రీడలలోనూ సమాన ప్రాధాన్యం ఇస్తున్నామనే దానికి ఇది నిదర్శనం అన్నారు. డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి వ్యక్తిగత శ్రద్ధతో బోధన, ప్రణాళికాబద్ధమైన అకడమిక్ విధానం, నిరంతర పరీక్షలు, ప్రత్యేక మెటీరియల్, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం అద్భుత ఫలితాలు సాధించామని తెలియజేశారు. ఇంతటి ఘనవిజయానికి కృషి చేసిన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సహకరించిన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

రైతలన్నలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం : ఎంఎల్‌ఏ

చంద్రగిరి, మే 1 ప్రభాతవార్త:

చంద్రగిరి నియోజకవర్గంలోని రైతన్నలకు సాగునీరు, ప్రజల దాహార్తిని తీర్చే త్రాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా హంద్రీ నీవా జలాలను చెరువులకు అనుసంధానం చేస్తున్నట్లు ఎంఎల్‌ఏ పులివర్తి నాని తెలిపారు. చిన్న రామాపురం పంచాయ తీలోని కణితిమడుగు చెరువు వద్ద శుక్రవారం ఆయన కూటమి నాయకులతో కలిసి మూలపల్లి సాగునీటి పథకానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటిశాఖ మంత్రి లోకేష్ సమన్వయంతో రాయలసీమ రైతన్నల కోసం ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. మండల పరిధిలని కందులవారిపల్లి, చిన్నరామాపురం, ఏ.రంగంపేట పంచాయతీల పరిధిలో గల చెరువులను హంద్రీ నీవా నీటితో నింపుతూ కళ్యాణీ డ్యామ్‌కు నీటిని తరలించే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ ప్రాంతంలోని చెరువులను నీటితో నింపడం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయనీ, తద్వారా రైతుల సాగునీటికి, ప్రజల త్రాగునీటికి గల ఇబ్బందులు శాశ్వతంగా దూరం కానున్నట్లు తెలిపారు.

చంద్రగిరిలోని మిట్టగంగమ్మ ఆలయంలో గర్భాలయ విమాన గోపురం నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఇందులో భాగంగా అర్చకులు ఎంఎల్‌ఏచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి ఆయనకు ఘన సన్మానం చేశారు. విశిష్ట దాతలు పిచ్చి జనార్ధన్ రెడ్డి, విశాలక్షి దంపతులు భూమి పూజలో పాలుపంచుకున్నారు. అగరాల గ్రామంలో ఎంఎల్‌ఏ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్ళి పంపిణీ చేశారు. పంపిణీ చేశారు. టిడిపి నాయకుడు, క్లాస్ 1 కాంట్రాక్టర్ ఏవి రమణమూర్తి, టిడిపి నాయకులు, అధికారులతో కలసి గ్రామంలో వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. పేదవాడి పెన్షన్ పథకం క్రమం తప్పకుండా అమలు చేస్తున్నట్లు తెలిపారు.

గర్భవతులకు సామూహిక శ్రీమంతాలు

చిట్టమూరు, మే 1 ప్రభాతవార్త: నాకు ఉన్న లేకున్నా నిరుపేదలకు ఆఖరి క్షణం వరకు అండగా ఉంటానని ఎం.వి.రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ అన్నారు. శుక్రవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యా ప్రదాత శ్రీ విద్యా వికాస్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ సభ్యులు స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఎంవి రావు ఫౌండేషన్ 18వ వార్షికోత్సవ సందర్భంగా గర్భవతులకు శ్రీమంతాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చిట్టమూరు మండలం మెట్టు గిరిజన కాలనీలోని మోడల్ ప్రైమరీ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ కృష్ణమ్మ సారథ్యంలో ఈ సామూహిక శ్రీమంతల కార్యక్రమంను ఎంవి రావు ఫౌండేషన్ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా అంగనవాడి కేంద్రం పరిధిలోని గర్భవతులుగా ఉన్న వారిని ఎంపిక చేసుకొని హిందూ సాంప్రదాయం ప్రకారం వారిని ప్రత్యేక ఆసనంపై కూర్చొని పెట్టి గర్భవతులు అవసరమైన చీర, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులు, పూలు, పండ్లు, స్వీట్లు, హాట్, బిస్కెట్లు వారి వద్ద ఉంచి అంగనవాడి కేంద్రం నిర్వాహకురాలు సుహాసిని చేతుల మీదగా గర్భవతులకు పసుపు కుంకుమ ఇచ్చి వారికి సారే చీర ఇచ్చి అత్యంత వైభవంగా సామూహిక శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లేదా మోహన్ కృష్ణ మాట్లాడుతూ తాము గతంలో నిర్వహించిన కార్యక్రమాన్ని తిరిగి మే డే రోజున అంగనవాడి కేంద్రాలలో నమోదు అయిన నిండు గర్భవతులకు సామూహిక శ్రీమంతాలకు శ్రీకారం చుట్టామన్నారు. ముందుగా స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మి చిత్రపటాలకు పూలమాలవేసి జ్యోతి ప్రజలవన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవి రావు ఫౌండేషన్ చైర్మన్ ముప్పవరపు లీలా మోహన్ కృష్ణ కార్యదర్శి ఎం విజయలక్ష్మి, అంగన్వాడి కేంద్రం సూపర్వైజర్ కృష్ణమ్మ, కేంద్రం ఇంచార్జ్ సుహాసిని, గర్భవతులు పాల్గొన్నారు.

శ్రీ చెంగాలమ్మ దేవస్థానంలో చండీయాగం

సూళ్లూరుపేట, మే 1 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని శ్రీ చెంగాల మాత పరమేశ్వరి దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మహా చండీ యాగాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలోని యాగ మండపంలో ముందుగా గోమాతకు పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన చండీయాగం మధ్యాహ్నం పూర్ణాహుతితో ముగిసింది. కోడి గోవిందరాజులు కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

మంత్రి నాదెండ్లకు జనసేన నేతల పరామర్శ

సూళ్లూరుపేట, మే 1 ప్రభాతవార్త: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను సూళ్లూరుపేట జనసేన నేతలు శుక్రవారం హైదరాబాదులో పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు షేక్ మాభాష, నక్క హరిబాబు, ఆవుల దాస్, ఎంబేటి ప్రవీణ్ పాల్గొన్నారు.

నూతన పెన్షన్ల పంపిణీ

సూళ్లూరుపేట, మే 1 ప్రభాతవార్త: కూటమి సర్కార్ ఆధ్వర్యంలో సంక్షేమ బాటలో సరికొత్తగా అర్హులైన వారికి కూడా పథకాల ఫలాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ప్రతినెలా ఒకటో తేదీన అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను అందజేస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ప్రతి నెలా పెన్షన్లు అందజేసే కార్యక్రమంలో భాగంగా సూళ్లూరుపేట మార్కెటింగ్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్ నేతృత్వంలో మన్నారు పోలూరు గ్రామంలోని గిరిజన కాలనీలో అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం నాడు పెన్షన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే విజయశ్రీ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు చేస్తున్న అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బాబు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని కాలనీ వాసులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

తడ,మే 1 ప్రభాతవార్త: మండల పరిధిలోని అక్కంపేట మోడల్ స్కూల్ విద్యార్థులు పదవ తరగతి ఉత్తీర్ణతలో ప్రభంజనం సృష్టించారు. మండల స్థాయిలో మొదటి, మూడవ స్థానాలు కైవసం చేసుకున్నారు అధిక మార్కులు సాధించిన విద్యార్థులను టిడిపి తిరుపతి జిల్లా అధికార ప్రతినిధి కామిరెడ్డి మురళి రెడ్డి అభినందించారు. వారి దాతత్వంతో విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించారు మండలంలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి 5000 రూపాయలు మూడవ స్థానం కైవసం చేసుకున్న విద్యార్థికి 2000 రూపాయలు అదేవిధంగా పాఠశాలలో అధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు నగదు ప్రోత్సాహాలు అందించారు ఈ సందర్భంగా మురళి రెడ్డి మాట్లాడుతూ విద్యతో పేదరికాన్ని జయించవచ్చునని విద్య విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేస్తుందని విద్యార్థి దశనుండే క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మనోహర్ మండల విద్యాశాఖ అధికారి వేములు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జనగణ సర్వేపై ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

తడ,మే 1 ప్రభాతవార్త: తడ మండలంలో జనగణ సర్వేపై సూళ్లూరుపేట రెవిన్యూ డివిజనల్ అధికారి దేవేందర్‌రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని కారూరు గ్రామంలో కొనసాగుతున్న జనగణ సర్వేలో పాల్గొన్నారు జన గణ సర్వే నమోదు చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని జనగణ సర్వే ప్రతినిధులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు జనగణ నమోదు విధానాన్ని పరిశీలించారు యాప్ నమోదులో సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు మండలంలో దక్షి ణం వైపు గ్రామాలలో తమిళ భాష ఎక్కువగా మాట్లాడే నేపథ్యం ఉండడంతో తమిళం తెలిసిన అధికారులను నిర్మించాలని సూచించారు ఈ తనిఖీల్లో తడ తహసిల్దార్ రవికుమార్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు...

కేవీ నాయుడుకు పితృవియోగం

పెళ్లకూరు, మే 1 ప్రభాతవార్త: రావులపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు చిల్లకూరు పిఏసిఎస్ చైర్మన్ కె.వి నాయుడు తండ్రి కొచ్చర్ల వెంకమ్మ నాయుడు (80)శుక్రవారం నాడు మృతి చెందాడు. గత రెండు రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వయోభారం కారణంగా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంత కాలంగా కె.వి నాయుడు అనారోగ్య సమస్యలతో చెన్నై లోని విజయ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా తండ్రి మరణ వార్త విని హుటా హుటిన స్వగ్రామమైన రావులపాడుకు చేరుకున్నారు. శనివారం ఉదయం రావులపాడులో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

జేఎన్‌టీయూ గోల్డ్ మెడల్ విజేతగా భావన

-శ్రీరామ కాలేజీలో ఘన సన్మానం

తిరుపతి విద్య, మే 1 ప్రభాత వార్త: కరకంబాడీ రోడ్‌లోని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థిని ఎస్. భావన విశిష్ట ప్రతిభ కనబరిచి జేఎన్‌టీయూ అనంతపూర్ పరిధిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగంలో 2021-25 విద్యాసంవత్సరానికి చెందిన భావన,87.58 శాతం మార్కులతో యూనివర్సిటీ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించి కాలేజ్‌కు గర్వకారణంగా నిలిచింది.జేఎన్‌టీయూ అనంతపూర్ నిర్వహించిన 15వ స్నాతకోత్సవంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ యెస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా భావన బంగారు పతకం మరియు ప్రశంసాపత్రాన్ని అందుకుంది.ఈ విజయాన్ని పురస్కరించుకుని శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ మన్నెం రామిరెడ్డి ,యాజమాన్యం భావనను నగదు బహుమతితో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తమ కళాశాల విద్యార్థిని గోల్డ్ మెడల్ సాధించడం ఎంతో గర్వకారణమని, విద్యా ప్రమాణాల్లో ఎలాంటి రాజీ పడకపోవడం వల్లే ఈ విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు.ప్రతి విద్యార్థి బాధ్యతతో చదువుకుని తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.భావన మాట్లాడుతూ, తన విజయానికి తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే కారణమని పేర్కొంది. అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కృషి చేస్తే విజయాలు సాధ్యమవుతాయని ఆమె తెలిపింది.ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. జయచంద్ర, వైస్ ప్రిన్సిపాల్ డా. ఎన్. వాసు, విభాగాధిపతి డా. కె.స్వప్న సుధతో పాటు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

-ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

నాగలాపురం, మే 1 ప్రభాతవార్త: నాగలాపురం మండల కేంద్రంలోని శ్రీ వేదనారాయణ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శుక్రవారం వేద మంత్రోచ్చారణల నడుమ ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు సంప్రదాయపద్ధతుల్లో ధ్వజా రోహణ కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో కళకళ లాడింది. ఉత్సవాల సందర్భంగా వివిధ సేవలు, వాహనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సోమకాసురుడుఅనే రాక్షసుడిని సంహరించి వేదలను బ్రహ్మదేవుడికి అప్పగించిన శ్రీ మహా విష్ణువు మధ్య దార రూపాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఏర్పాటు చేశారు. ఈ అధ్యాత్మిక ఘట్టాన్ని ప్రతిభదించే విధంగా రూపొందించిన విగ్రహాలు అలంకరణలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మే 1 నుంచి 9వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాలకు దేవాలయంను విద్యుత్‌దీపాలంకరణతో సుందరంగా తీర్చిదిద్దారు. కనుల పండుగగా శ్రీ వేదనారాయణ స్వామి ఆలయం తీర్చిదిద్దారు.

చిన్న కొటాయ్ ఉత్సవం ముగింపు: గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,మే 1 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాల యంలో పది రోజుల పాటు నిర్వహించిన చిన్న కొటాయ్ ఉత్సవం శుక్రవారంతో ముగిసింది. ప్రతి రోజూ స్వామి అమ్మవార్లను అలంకార మండపంలో ముస్తాబు చేసి ప్రాకరం ఆవరణలో ఉత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను పగడ చెట్టు కింద వట్టివేళ్ల చాపల్లో చల్లదనాన్ని అందించారు. ప్రతి రోజూ స్వామి అమ్మవార్లకు ప్రాకరంలో అభిషేకాలు, అలంకారాలు నిర్వహిం చారు. శుక్రవారంతో ఉత్సవాలుముగిసాయి ఇక వేసవి ఎండలను తట్టుకునేందుకు స్వామి వారి గర్భగుడిలో మూలవిరాట్టుకు ఈ నెల 4 ధారా పాత్రను ఏర్పాటు చేయనున్నారు. శుక్రవారం చిన్నకొటాయ్ ఉత్సవం ముగింపు సందర్భంగా స్వామి అమ్మవార్లను చక్కగా ముస్తాబు చేసారు.అలంకారాల మండపం వద్ద స్వామి అమ్మవార్లను కేడియగం వాహనంలో ప్రతిష్టించి మేళ తాళాలు మంగళవాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాన్ని పౌర్ణమి సందర్భంగా పండు వెన్నెల్లో ఊరేగిస్తుంటే వేయి కళ్ల చాలవనట్లు మారింది.ఆలయ ఇన్సెపెక్టర్ వెంకటస్వామి వారి సిబ్బందితో గ్రామోత్సవం సాగింది.

గరుడ వాహనంపై చెన్న కేశవ స్వామి రాజసం

శ్రీకాళహస్తిరూరల్,మే 1 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఊరందూరు గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం గిన్నెభిక్ష ఉత్సవాన్ని కన్నుల పండువగా ఆలయ అర్చకులు జనార్ధనశర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. రాత్రి గరుడసేవ కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరుడ సేవ కార్యక్రమాలను ఆలయ కార్య నిర్వహణాధికారి బికె వెంకటేశులు పర్యవేక్షణలో కార్యక్రమాలు సాగాయి. ఆలయఅర్చకులు అర్ధగిరి వేదమంత్రాలను పఠిస్తుండగా ఉత్సవం కన్నుల పండువగా సాగింది.వైష్ణవాలయాల్లో బ్రహ్మోత్సవాల్లో అత్యధిక ప్రాధాన్యత గరుడోత్సవానికి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం గరుడ వాహన సేవకు స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఉభయదారుడుగా వారి కుటుంబసభ్యులతో కలసి హాజరయ్యారు. వేదపండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా స్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ప్రతిష్టించారు. ఆలయం నుంచి స్వామి అమ్మవార్లను సుధీర్‌రెడ్డి మోసుకుంటూ వచ్చి గరుడ వాహనంలో ప్రతిష్టించారు.మేళ తాళాలు మంగళవాయిద్యాలతో గ్రామం దద్దరిల్లింది. నాలుగుమాడావీధుల్లో ఉత్సవం సాగింది.ఈ కార్యక్రమాలను ఎఇఓ హేమామాలి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, సహాయకుడు దుర్గా ప్రసాద్ సారథ్యంలో నిర్వహించారు

గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, మే 1 ప్రభాతవార్త: శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహనంపై శుక్రవారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడవాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ పండు వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ వల్లంశెట్టి రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునికుమార్, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాణిపాకంలో శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం

కాణిపాకం, మే 1 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం అనుబంధ ఆలయం శ్రీ వరదరాజస్వామి ఆలయంలో చిత్రాపౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతి నెలా పౌర్ణమి రోజున ఆలయంలో సత్యనారాయణ వ్రతం నిర్వహించడం ఆనవాయితీ. ఈ మేరకు శుక్రవారం అర్చకులు ఈ వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకం నిర్వహించి పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ మండపంలో సత్యనారాయణస్వామి వారి చిత్రపటంను వుంచి అర్చకులు ఈ వ్రతంను నిర్వహించారు. ఈ మేరకు ఈ వ్రతంను ఆచరించడం వల్ల కలిగే శుభ ఫలితాల గురించి అర్చకులు భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఆలయంలో రాత్రి పున్నమి గరుడసేవను ఘనంగా నిర్వహించారు. అలంకరించిన స్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై వుంచి గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బస్సు క్రిందపడి మహిళా కూలీ మృతి

చంద్రగిరి, మే 1 ప్రభాతవార్త : ద్విచక్ర వాహనంపై వెళుతూ స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి ప్రమాదవశాత్తు క్రిందపడిన మహిళా కూలీ తలపై మదనపల్లె నుండి తిరుపతి వస్తున్న బస్సు ముంద చక్రం ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందినది. ఈ ఘటన శుక్రవారం మోహన్‌బాబు యూనివర్సిటీ బస్టాండ్ వద్ద చోటు చేసుకున్నది. తిరుపతి పల్లివీధికి చెందిన నరశింహులు నాయుడు భార్య రమణమ్మ దంపతులు మేస్త్రీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. పని ముగించుకుని తిరిగి ఇంటికి వెళుతూ ప్రాణాలు పోగొట్టుకున్నది పోలీసులు మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సూళ్ళూరుపేట డివిజన్

నాయుడుపేటలో ఎర్రజెండా రెపరెపలు

నాయుడుపేట, మే 1 ప్రభాతవార్త: నాయుడుపేటలో గత ఎన్నో సంవత్సరాలుగా మేడే కార్మికుల దినోత్సవం నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని మెకానిక్ యూనియన్ నాయకులు అలీ భాయ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా తీరని కోరికగా ఆటోనగర్ కల కలగానే మిగిలిపోయిందని గవర్నమెంట్ కార్యాలయాల్లో మాకు సంబంధించిన మా ఫైల్ మాత్రం కదపడం లేదని అధికారులు చిత్తశుద్ధి చూపించడం లేదని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వంలో నెలవల సుబ్రహ్మణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యే విజయశ్రీ అధ్యక్షతన మాకు ఆటోనగర్ వస్తుందని నమ్మకంతోనే ఉన్నామని అన్నారు. గత సంవత్సరం పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు 786 రఫీ మెకానిక్ యూనియన్ గౌరవ అధ్యక్షులుగా యూనియన్ సమస్యలు పరిష్కరించి పరిష్కరిస్తానని మాట ఇచ్చినప్పటికీ ఆటోనగర్ ఏర్పాటు చేసేందుకు గతంలో మాటిచ్చినప్పటికీ కార్మికులకు ఎటువంటి విధానాన్ని నెరవేర్చలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నజీర్, శ్రీనివాసులు రమేష్. ఫయాజ్, కాలేశా, పలువురు యూనియన్‌కి సంబంధించి మెకానిక్ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో మేడే సంబరాలు

నాయుడుపేట, మే 1 ప్రభాతవార్త: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మేడే కార్మికుల దినోత్సవ పండుగ శుక్రవారం నాయుడుపేట విద్యుత్‌శాఖ కార్యాలయంలో విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వి శ్రీకాంత్ అధ్యక్షతన నేడు మే డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడే దినాన్ని పురస్కరించు కుని నాయుడుపేట విద్యుత్ శాఖ కార్యాలయంలో పలువురు విద్యుత్ శాఖ అధికారులు, కార్మికులు మే డే సందర్భంగా జెండా ఎగరవేసి మే డే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేకులు కట్ చేసి కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో బాబు, లైన్మెన్ ప్రభాకర్, లైన్మెన్ రామస్వామి, గురువయ్య, ముని ప్రసాద్, దిల్లు ముని రాజా, రాజేష్ తదితర జేఎల్ఎంలు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు తెలియజేశారు.

సిఐటియు ఆధ్వర్యంలో మే డే వేడుకలు

నాయుడుపేట, మే 1 ప్రభాతవార్త: నాయుడుపేట సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు జెండాను అంగనవాడి ప్రాజెక్టు కార్యదర్శి ఎన్ శ్యామలమ్మ ఆవిష్కరించారు. కరెంట్ ఆఫీస్ వద్ద పివిఎస్ హాస్పిటల్ ముందు మినీ వ్యాన్ స్టాండ్ వద్ద జెండాలను ఆవిష్కరించారు. సిఐటియు కార్యాలయం నుండి నుండి బజారు వీధుల మీదగా మే డే వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ అంబేద్కర్ బొమ్మ వద్ద సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ మాట్లాడుతూ కార్మికుడు కష్టం బియ్యపు గింజ నుండి ఏరోప్లేన్ తయారు చేసే దాకా కార్మికుడు కష్టం లేకుండా ఏవి కదలవన్నారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు శివకవి ముకుందా సిఐటియు మండల అధ్యక్షులు ఎస్ మహేష్ బాబు మాట్లాడుతూ ఇంగ్లాండ్లో పారిశ్రామిక విప్లవం జరిగింది. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే విజయమ్మ, ఎస్.కె పరిజియ, ఆశ వర్కర్ జిల్లా కార్యదర్శి కవిత, కేరడార్ నాయకులు అబ్దుల్లా, ఆశ వర్కర్స్ మండల నాయకులు అప్సాన మున్సిపాలిటీ యూనియన్ నాయకులు ఎస్కె కాలేశా, ఆటో యూనియన్ జిల్లా నాయకులు మస్తాన్ రెడ్డి, యునైటెడ్ ఎంప్లాయిస్ యూనియన్ నాదముని, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

వెంకటగిరి, మే 1 ప్రభాతవార్త: లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు బాలసుబ్రమణ్యం తెలిపారు.ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను ఆవిష్కరించారు. అనంతరం విశ్వదయ కళాశాల ప్రాంగణం నుండి భారీ ర్యాలీ ప్రారంభమై, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, త్రిభువని సెంటర్ మీదుగా పాత ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక వర్గ రాజ్య స్థాపన కోసం కార్మిక వర్గం అంతా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీపీ ప్రకృతి కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్నారని అన్నారు. సిఐటియు తిరుపతి జిల్లా ఉపాధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ, కార్మికులకు స్థిరమైన ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు స్వరూప రాణి మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికుల సమస్యలను వివరించి, తగిన గౌరవ వేతనాలు మరియు సేవా భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు లక్ష్మి ప్రసన్న, నాయకులు వరలక్ష్మి అన్నపూర్ణ సిఐటియు కోశాధికారి నిర్మల ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు మీనా చంద్రకళ సుబ్బమ్మ మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రసాద్ సిఐటియు నాయకులు ఎంవి రమణ మహిళా సంఘం ఐద్వా నాయకులు ఎస్ఎఫ్ఐ నాయకులు డివైఎఫ్ఐ నాయకులు బాలాయపల్లి మండలం భూ పోరాట సాధన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రఫీ శేషయ్య గంప వెంకటరమణయ్య తదితర సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్మికులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మార్చిన కేంద్రపాలకులు

వెంకటగిరి, మే 1 ప్రభాతవార్త: ప్రపంచ కార్మిక పోరాట దీక్షాదినం మేడేని పురస్కరించుకొని నాడు మేడే జెండాలను ఆవిష్కరించారు. స్థానిక పల్లె వీధి సెంటర్లోని కాళహస్తి శేషయ్య స్మారక భవనం వద్ద మేడే జెండాని రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లు తెచ్చారని దీంతో కార్మికులను కంపెనీల యజమానుల దగ్గర వెట్టిచాకిరి చేసే బానిసలుగా మార్చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాతంత్ర చేనేత కార్మిక సంఘం నాయకులు సిహెచ్ చిన ఓబయ్య, డి భాస్కర్, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.అజిత, రైతు కూలీ సంఘం నాయకులు జి.కృష్ణారెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి తంబిరాజా చేనేత కార్మికులు, వివిధ కంపెనీల కార్మికులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

వెంకటగిరి, మే 1 ప్రభాతవార్త : పట్టణం, గ్రామాల్లో స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం సిబ్బంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఉదయం 6 గంటల నుండి పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సూచనల మేరకు కొందరు టిడిపి నాయకులు కూడా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ ఈగ కిరణ్, ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

గణనాథుడిని దర్శించుకున్న రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్

కాణిపాకం, మే 1 ప్రభాతవార్త: రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ శుక్రవారం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు దేవస్థానం చైర్మన్ మణినాయుడు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజ గోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆయన స్వామి వారి సేవలో పాల్గొన్నారు. అలాగే శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహాలయంలో కూడా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేద మండపంలో ఆశీర్వచనం చేసి స్వామి వారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఇదిలా వుండగా పసుపులేటి హరిప్రసాద్‌ను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ స్థానిక దేవస్థానం అతిథి గృహంలో కలిసి పూతలపట్టు నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. అలాగే దేవస్థానం వద్ద రాష్ట్ర హస్త కళల సంస్థ స్టాల్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే కఠిన చర్యలు

నాగలాపురం, మే 1 ప్రభాతవార్త:

నాగలాపురం మండలం బయట కొడియంబేడు వద్ద శుక్రవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో లైసెన్స్ లేకుండా ట్రాక్టర్లు నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లను గుర్తించి, సంబంధిత రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని తనిఖీలు మరింత కఠినంగా కొనసాగిస్తామని తెలియజేశారు. గత మూడు నెలలుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగడం వలన లైసెన్స్ లేకుండా వాహనం నడపడం చట్ట విరుద్ధమని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు భద్రత అందరి బాధ్యతని ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు తప్పనిసరి హెల్మెట్ ధరించాలని ఎస్ఐ తెలియజేశారు.

మేడే పోరాటం కొనసాగాలి : ఏఐటీయూసీ

పుత్తూరు రూరల్, మే 1 ప్రభాతవార్త:

ప్రతి సంవత్సరం మే 1 జరుపుకునే మేడే కేవలం ఒక చారితితో గుర్తింపు కాదా అదిపోరాటానికి పిలుపు అని శుక్రవారం పుత్తూరు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ దీవి నాగేశ్వరరావు పాల్గొని పథకావిష్కరణ చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ పుత్తూరు మండల కార్యదర్శి మహేష్, ఏఐటీయూసీ పుత్తూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపి, చంద్రబాబు, ఏఐటీయూసీ నాయకులు, ఆశ వర్కర్లు, జిల్లా కార్యదర్శి చందామరి, నాయకులు ధనలక్ష్మి, మున్సిపల్‌వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు విజయకుమార్, నాయకులు ప్రభాకర్, రమణ, రమేష్, కృష్ణారెడ్డి, దిలీప్, మోహన్, మున్సిపల్ కార్మికులు అమాలి కార్మికులు శానిటేషన్ కార్మికులు, ఆటో కార్మికులు, ఎలక్ట్రిషన్ కార్మికులు, ఆశ కార్మికులు మిడ్‌డే మిల్స్ కార్మికులు, టాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

కార్మిక హక్కుల కోసం పోరాడాలి

చిట్వేలి, మే 1 ప్రభాతవార్త:

మే డే స్ఫూర్తితో కార్మిక హక్కుల కోసం కలసి పోరాడాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం 14 వ మేడే వేడుకలను ఎమ్మార్వో కార్యాలయం వద్ద సిఐటియు మండల కన్వీనర్ సుజాత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మాజీ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మే 1న జరుపుకునే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే, కార్మికుల హక్కులు, పోరాటాలు మరియు త్యాగాలను స్మరించుకునే రోజు అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పందికాళ్ళ మణి, వీఆర్ఏల సంఘం జిల్లా కార్యదర్శి కొరముట్ల సుధాకర్, అంగన్వాడి ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఎం వసంత, అంగన్వాడి లీడర్స్ పగడాల సుధామణి, శ్రీదేవి, సుబ్బరత్న, సులోచన, నాగరత్న, లక్ష్మీ కుమారి మ్యాక్సీ స్టాండ్ యూనియన్ మల్లి, నాని. సిద్దు, సాదక్ అంగన్వాడీ వర్కర్లు. ఆయాలు, వీఆర్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాండురంగస్వామి అగ్నిగుండం

శ్రీకాళహస్తిరూరల్, మే 1 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి మండలంలోని గ్రామాల్లో వేసవి సందర్భంగా పాండురంగస్వామి తిరునాళ్ళు సంబరాలు చోటు చేసుకున్నాయి. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తిమండలంలోని ముచ్చివోలు దళిత వాడ, ఓబుళాయిపల్లి, ముద్దమూడి గ్రామాల్లో పాండురంగస్వామి తిరునాళ్ళు సందర్భంగా సంబరాలు చోటు చేసుకున్నాయి. శుక్రవారం రాత్రి కన్నుల పండువగా 'అగ్నిగుండం కార్యక్రమాలను' నిర్వహించారు. అగ్నిగుండం సందర్భంగా భక్తులుమాలలు ధరించి గోవింద నామస్మరణతో మారుమోగింది. సాయంత్రం పూజారి బాగిర్తి శంకరయ్య ముందుగా అగ్నిగుండంలో పూల బంతిని వేసి తిప్పుకుంటూ ఆగ్నిగుండ ప్రవేశం జరిపారు. ఇక మండలంలోని ప్రతి గ్రామంలో ఈనెల అగ్నిగుండ కార్యక్రమాలు జరగనున్నాయి.

ప్రళయ కాల సంకేతాలు గోచరిస్తున్నాయి!

-హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:

నాడు మన ప్రవక్త సూచించిన ప్రణయకాల సంకేతాలు గోచరిస్తున్నాయని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ వివరించారు. శుక్రవారం జామియా మసజిద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 1500 సంవత్సరాల క్రితమే ప్రవక్త ప్రళయ కాల సంకేతాల గురించి సూచించారన్నారు. మనల్ని సృష్టించిన అల్లాహ్ స్పష్టంగా తను అందించిన దివ్యఖుర్ ఆన్‌లో సమాజ స్థితి గతులను వివరించారన్నారు. ఈ ప్రపంచం శాశ్వతం కాదన్నారు. మనిషికి ఇది కేవలం మజిలి మాత్రమే అన్నారు. మనం ఇక్కడ శాశ్వతంగా ఉండటానికి రాలేదని మనం ఏదో ఒక రోజు మరణాన్ని చవి చూడక తప్పదని హెచ్చరించారు. మనకు శాశ్వత జీవితం మరణం తరువాతనే అన్నారు. మనం ఇక్కడ చేసుకున్న మంచి మనల్ని స్వర్గస్తుల్ని చేస్తుందన్నారు. మనం అల్లాహ్ ఆదేశాల మేరకు నడచుకోవాలి తప్ప మన ఇష్టాను సారం నడుచుకోరాదన్నారు. ప్రళయానికి ముందు ఆద్భుతమైన మసీదులు నిర్మిస్తారు కానీ అక్కడ భక్తులు పరిమితంగా ఉంటారని సూచించ రన్నారు. సమాజంలో మహిళల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతుందని సమాజంలో వ్యభిచారం పెచ్చుపెరిగిపోతుందని సూచించారన్నారు. మన సంపాదనలు, సంపదలు, బంధులు, కుటుంబసభ్యులు ఎవ్వరూ మనతో రారని మని పది మందికి చేసిన మంచి మన ధార్మిక చింతనేమ నల్ని కాపాడుతుందనే సత్యాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని రేహాన్ సూచించారు.

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక కార్మికులు

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:

మన దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముక కార్మిక లోకం అని శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు జి.విజయ కుమార్ నాయుడు అన్నారు. శుక్రవారం ఈదుల గుంట ఈద్‌గాహ్ వద్ద పట్టణంలోని మోటార్‌మెకానిక్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన మేడే కార్యక్రమాల్లో విజయకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వృత్తి ఏదైనా శ్రమించే ప్రతి మనిషికి సమాన గౌరవం ఇవ్వటం మన కర్తవ్యంగా భావించాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మేడే జెండాను ఎగురవేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అనునిత్యం కార్మిక, కర్షకులకు సంబంధించి ఆలోచిస్తుందని వారి సంక్షేమ కార్యక్రమాలను యోచిస్తుందని వివరించారు. ఈ సందర్భంగా సంఘాధ్యక్షుడు అంజద్ బాషా మోటార్ మెకానికల్స్ ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా ఆయన శాసనసభ్యుడు సుదీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామన్నారు. కార్మికుల సమస్యలపై ఆయన నిత్య యోచిస్తున్నారని వివరించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు అంజద్ బాషాతో పాటు జయన్న, మధు, షఫీ, షాకీరాలి, చెంచయ్య, అయ్యప్ప, కార్మికులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియర్ సారధ్యంలో మేడే

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి ఎపియస్ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ సారధ్యంలో శుక్రవారం మేడే సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా గౌరవాధ్యక్షుడు శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. ఆయన యూనియన్ జెండాను ఆవిష్కరించారు. మే డే పర్వదినాన్ని పురస్కరించుకొని యూనియన్ నాయకులు ఏర్పాటు చేసిన కేక్‌ను శ్రీనివాసులు కట్ చేసారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర సహాయ కార్యదర్శులు పిఎస్‌సి కుమార్, ప్రాంతీయ కార్యదక్షుడు సి.మధు, అధ్యక్షుడు జిపిఎస్ ఆచారి, జాయింట్ కార్యదర్శి టి.లింగమూర్తి, కోశాధికారి ఎస్ కుప్పయ్య, పట్టాభి, రామకృష్ణ, ఈశ్వరయ్య, ఎన్ఎంఆర్ అనంతం, మధవాచారి, రమేష్, రాజేష్, మురళి, ఎంఎస్ మణ్యం, ప్రసాద్, ఉదయ్‌కుమార్, రామకృష్ణ, అమరావతి జేఏసి మహిళా సభ్యురాలు ఏ.గురవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి మెరిట్ విద్యార్థులకు ఘన సన్మానం

- మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన హారిక, అక్షయ్
- జిల్లా స్థాయిలోనూ 10వ ర్యాంకు సాధించిన వైనం

పాకాల, మే 1 ప్రభాతవార్త:

పదవ తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. మండల విద్యాశాఖ అధికారులు బాబ్జి, లింగయ్య విద్యార్థులకు శాలువాలు కప్పి, బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో దామలచెరువు ఉన్నత పాఠశాలకు చెందిన ఏ. హారిక, పాకాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. అక్షయ్ 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. వీరు మండల స్థాయిలోనే కాకుండా జిల్లా స్థాయిలో కూడా 10వ స్థానాన్ని కైవసం చేసుకోవడం విశేషమన్నారు. విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులను, ప్రోత్సహించిన తల్లిదండ్రులను వారు ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి, తల్లిదండ్రులకు మరియు గురువులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణపతి, దొరస్వామిరెడ్డి, ఇందిరా, రెడ్డి సుశీల, బాబు నాయుడు, విశ్వనాథ్ రెడ్డి, రూత్ పావని, సీఆర్పీలు శ్రీనివాసులు, ప్రకాష్ రెడ్డి, మునికృష్ణ, జ్యోతి, శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం

పాకాల, మే 1 ప్రభాతవార్త:

పాకాల మండలం కావలివారి పల్లె గ్రామంలో పెద్ద రెడ్డప్ప అనే వ్యక్తి చనిపోవడంతో ఆయన భార్య బి. సాలమ్మకు కొత్త పెన్షన్ మంజూరు చేసి శుక్రవారం రోజున ఇప్పించటం జరిగింది. ఇది మంచి ప్రభుత్వం అనడానికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే పులివర్తి నాని వితంతు పెన్షన్ అందుకున్న సాలమ్మ కృతజ్ఞతలు తెలిపారు. పాకాల సింగల్ విండో చైర్ పర్సన్ క్రిష్ణమనేని సావిత్రి, మాజీ సర్పంచ్ చెంగల్‌రాయలు, పంచాయతీ సెక్రటరీ బషీర, వేణుగోపాల్, జగదీష్, గురునాథ్, కూటమి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆధునీకరించిన తహసీల్దార్ కార్యాలయం ప్రారంభం

విజయపురం, మే 1 ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయాన్ని మరమ్మతులు చేపట్టి శుక్రవారం నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. కార్యక్రమంలో నగరి ఆర్డీవో అనుపమ, విజయపురం తహసీల్దార్ కిరణ్, నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మ, ఎంపీపీ లక్ష్మిపతిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, బాబుయాదవ్, ముని భాస్కర్‌రాజు, రెవెన్యూ సిబ్బంది, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండ : ఎమ్మెల్యే

విజయపురం, మే 1 ప్రభాతవార్త:

రాష్ట్రంలోని ప్రతి అర్హులైన కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విజయ పురం దళితవాడలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ నగదును లబ్ధిదారులకు నేరుగా ఆయన అందించారు. 4 వేల రూపాయల నుంచి 15 వేల వరకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం కూటమి ప్రభుత్వం మాత్రమే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మిపతిరాజు, నగరి ఏఎంసీ చైర్మన్ రాజమ్మ, స్థానిక నాయకులు రమేష్‌రాజు, బాబుయాదవ్, ముని భాస్కర్‌రాజు, కపిల్‌జాన్, ఏళుమలై, సామేలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ళత్తూరులో చలివేంద్రం ప్రారంభం

విజయపురం, మే 1 ప్రభాతవార్త:

మండలంలోని ఇళ్ళత్తూరు గ్రామంలో వేసవి దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో నగరి రూరల్ సీఐ భాస్కర్ శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. చలివేంద్రం ఏర్పాటు చేసినందుకు సీఐ భాస్కర్, ఎస్ఐ వెంకట సుబ్బయ్యలను గ్రామస్తులు శాలువ కప్పి అభినందించారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి మునిభాస్కర్‌రాజు, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, స్థానిక టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, కొల్లాపురి, వరదరాజులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మేడే కార్మికుల దినోత్సవం

కేవీబీ పురం, మే 1 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీ పురంలో పరిశ్రమలో పని చేస్తు న్న కార్మికులు స్కీం వర్కర్లు, మున్సిపల్ కార్మికులు, ఆశలు, అంగన్ వాడీలు, విద్యుత్ కార్మికులు, తాపీ మేస్త్రి, ఉపాధి కార్మికులు సంఘమిత్రలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ప్రతి కార్మికులు మేడే దినోత్సవం సీఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక పండుగ వాతావరణంలా నిర్మించుకోవాలని నారాయణవనం, పిచ్చాటూరు, కేవీబీ పురం ప్రాంతీయ కార్యదర్శి నాగలాపురం నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు పాల్గొన్నారు.

అడవిలో తప్పిపోయిన మహిళ సురక్షితం

-రెండు రోజుల తరువాత గుర్తించిన గ్రామస్తులు

నాగలాపురం, మే 1 ప్రభాతవార్త:

నాగలాపురం మండలం బీరకుప్పం గ్రామానికి చెందిన దాక్షాయని అనే మహిళ బుధవారం ఉదయం ఉపాధిహామీ పనులకు వెళ్లి భూపతిశ్వర కోన అడవి ప్రాంతంలో తప్పిపోయిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసి నాలుగు బృందాలుగా గాలింపు చర్యలు చేపట్టారు. బీరకుప్పం గ్రామానికి చెందిన గ్రామస్తులు కూడా పోలీసు వారితో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారంబీరకుప్పం ఎస్సీ కాలనీకి చెందిన కొందరు ఉపాధిహామీ కార్మికులు అడవిలో పనులకు వెళ్లిన సమయంలో ఓ మహిళ గట్టిగా అరవడం వినిపించడంతో అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆమెను దాక్షాయణిగా గుర్తించడం జరిగింది. అనంతరం వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని ఆమెను సురక్షితంగా బయటకుతీసుకొచ్చారు. రెండు రోజుల పాటు అడవిలో ఆహారం లేక ఉండడంతో మహిళ కొంత నీరసం చెందినట్లు తెలిసింది. అనంతరం ఆమెను పోలీసు వాహనంలో ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

తిరుపతి డివిజన్

రక్తదానం...మహాదానం

రేణిగుంట, మే 1 ప్రభాతవార్త :

అన్ని దానాల్లో రక్తదానం గొప్ప దని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అమర బ్లడ్ సెంటర్ అమరా ఫౌండేషన్ యూనిట్ ప్రతినిధులు పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ అమర ఆసుపత్రి నందు ఇండో ఎంఐఎం లిమిటెడ్ ఉద్యోగులు, యాజమాన్యం, మానవ వనరుల (హెచ్ఆర్)విభాగం, హెచ్ ఆర్ మేనేజర్ కిరణ్ కుమార్ దాసరి నాయకత్వంలో, అమర ఆసుపత్రి సిబ్బంది సేవాభావంతో రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ఆపదలో ఉన్న వ్యక్తులకు అవయము దానం చేసినట్లేనని ఉద్ఘాటించారు. భయపడకుండా యువకులంతా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని పౌండేషన్ ప్రతినిధి శ్రీధర్ రావిపాటి పిలుపునిచ్చారు.

కష్టానికి కీర్తి కిరీటం, కార్మికుల ఘనతకు మేడే వేదిక

సత్యవేడు, మే 1 ప్రభాతవార్త:

పునాదులైన కార్మికుల సేవలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐదుగురు ప్రతిభావంతులైన ఉద్యోగులను వారి విశిష్ట కృషికిగుర్తింపుగా అవార్డులతో సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్థ పురోగతిలో కార్మికులపాత్ర అమూల్యమని పేర్కొంటూ ఏపీపీ శ్రీరామ్, జనరల్ మేనేజర్ శ్రీ చల్లా మోహన్ బాబు, హెచ్ఆర్ మేనేజర్ జి.రమేష్, బాలాజీ ముందుండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమమే సంస్థ విజయానికి మూలస్తంభమని వారు స్పష్టం చేస్తూ భవిష్యత్‌లోను కార్మికుల అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.

ఈశ్వరయ్య మెమోరియల్ క్రికెట్ టోర్నీ

వడమాలపేట, మే 1 ప్రభాతవార్త:

ఈశ్వరయ్య మెమోరియల్ క్రికెట్‌టోర్నమెంట్ వడమాలపేట మండలంపాదిరేడు గ్రామంలో శుక్రవారం ప్రారంభమైంది. టీడీపీ నాయకుడు పూల గణపతి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వడమాలపేట ఎస్ఐ హరీష్ టోర్నమెంట్‌ని ప్రారంభించారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా స్ఫూర్తిని పాటించాలని కోరారు.

భారతదేశానికి బౌద్ధమే శరణ్యం

- ఉపాసకులు మన్నేరు విజయమోహన్ రెడ్డి

పాకాల, మే 1 ప్రభాతవార్త:

ప్రతి మనిషికి, ఈ దేశానికి బౌద్ధమే శరణ్యమని ఉపాసకులు మన్నేరు విజయమోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుపతి జిల్లా పాకాల మండల కేంద్రంలోని ఆయన నివాసం రాజ గృహంలో బుద్ధ పూర్ణిమ పురస్కరించుకుని బుద్ధ వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... సమానత్వం, సోదరభావం, మానవ విలువలతో కూడిన జీవన విధానం బౌద్ధంతోనే సాధ్యమని పేర్కొన్నారు. "భారతదేశానికి బౌద్ధమే శరణ్యం అని ఆనాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటే మానవాళికి దుఃఖం ఉండదని ఉద్ఘాటించారు. బౌద్ధం కేవలం ఒక మతం కాదని, అది కరుణ, ప్రేమ, ప్రజ్ఞలతో నిండిన ఒక గొప్ప జీవన మార్గమని కొనియాడారు. మనిషి తనలోని ఈర్ష్య, అసూయ, ద్వేషాలను విడనాడితేనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి. ఆంజనేయులు, పి. జైబాల, జి. నరసింహులు, మన్నేరుప్రభు, ఆమూరిసుధాకర్, అంబేద్కర్ వారసులు, ఉపాసకులు, బౌద్ధ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాయడం అన్యాయం

పాకాల, మే 1 ప్రభాతవార్త:

పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను ప్రభుత్వాలు కాలరాయడం దారుణమని ఏఐటీయుసి జిల్లా నాయకులు ఎం. ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తిరుపతి జిల్లా పాకాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల అమ్మ ఆటో స్టాండ్ ప్రాంగణంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎర్ర జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎం. ప్రకాష్ మాట్లాడుతూ 1886లో చికాగో నగరంలో కార్మికులు తమ హక్కుల కోసం చేసిన పోరాట ఫలితమే నేటి మే డే అని, నేడు 140వ మే డే జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ప్రధాన డిమాండ్లు అంగన్వాడీ, ఆశా, సంఘమిత్ర, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 ఇవ్వాలి. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలి. ఆటో కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డుఖి ఏర్పాటు చేయాలి. ఈ కార్యక్రమంలో ముషీర్, చిన్ని, పురుషోత్తం, ఆంతోని, కేశవయ్య, షారుక్, దాము, గిరి, ఢిల్లీ రాజా, ఇతర కార్మికులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక చట్టాల నిర్వీర్యం తగదు

- ఏఐటీయూసీ జిల్లా నాయకులు ప్రకాష్

పాకాల, మే 1 ప్రభాతవార్త :

కార్మికులు ప్రాణత్యాగాలతో సాధించుకు న్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడం అన్యాయమని ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఎం. ప్రకాష్ విమర్శించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం తిరుపతి జిల్లా పాకాల మండలం, నేండ్రగుంట వద్ద గల మూలస్థానమ్మ ఆటో స్టాండ్ ప్రాంగణంలో ఆయన ఎర్ర జెండాను ఆవిష్కరించి కార్మికులను ఉద్దేశించి ప్రసంగించారు. కార్మికులందరికీ ఈఎస్ఐ సౌకర్యం మరియు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు సిద్దయ్య, మునిరాజా రెడ్డి, మురళి, రమణ, రమేష్, నాగరాజా, మల్లికార్జున, చిన్నరాజు, సుధాకర్, హరిబాబు, మునికృష్ణ, రమేష్, ప్రవీణ్, కోటి, ఇతర కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రీ నాగాలమ్మదేవాలయంలో అన్నదానం

పుత్తూరు రూరల్, మే 1 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని రైల్వే కోటర్స్ సమీపంలో ఉన్న శ్రీ నాగాలమ్మ దేవాలయంలో శుక్రవారం పౌర్ణమి సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం భక్తులకు చేశారు. ఉదయం ఆలయంలోని వినాయక స్వామికి మానసాదేవి అమ్మవారికి నుబ్రహ్మణ్యేశ్వరుడికి, నాగాలమ్మకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు.

తిరుపతి డివిజన్

నిరుపేదల ఆశాజ్యోతి చంద్రబాబునాయుడు

శ్రీకాళహస్తిమే 1 ప్రభాతవార్త:

నిరుపేదల ఆశాజ్యోతి చంద్రబాబునా యుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నిరుపేదల కళ్ళలో సంతోషాన్ని చూడాలని భారత దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్‌ను రూ.4వేలకు పెంచారని శ్రీకాళహస్తి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు అన్నారు. ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో భాగంగా శుక్రవారం రాజీవ్ నగర్‌లో ఓ వికలాంగునికి పెన్షన్‌ను అందించారు. ఈ కార్యక్రమాల్లో విజయకుమార్‌నాయుడుతో పాటు గోపి, మధు,సురేష్,తులసమ్మ,అమరావతి,ద్రాక్షాయణిచెంచయ్య,లోకేష్,కార్తీక్,సచివాలయసిబ్బందిపాల్గొన్నారు.

మహిళల భద్రతపై అవగాహన

వడమాలపేట, మే 1 ప్రభాతవార్త:

కుటుంబ సభ్యులు కాని, ఇతర వ్యక్తులు కాని మహిళలను వేధిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మహిళలు భద్రతపై అవగాహన కార్యక్రమంను బాలాజీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించాలని, వారి హక్కులను భంగం కలిగించేలా ఎవరు ప్రవర్తించిన శిక్ష తప్పదన్నారు. మహిళలకుభద్రత కల్పించడం పోలీసు బాధ్యత అని ఎవరికి ఇబ్బంది కలిగిన టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీంద్ర, వడమాలపేట ఎస్ఐ హరీష్, వెలుగు ఏపీఎం మునికృష్ణారెడ్డి,తెలుగుదేశం పార్టీ మహిళ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీప్రసన్న, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ధనంజయలునాయుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి హేమావతి, ధనలక్ష్మి, పోలీసులు డిల్లీబాబు,సెల్వం తదితరులు ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మరమగ్గ కార్మికుల ఇంటింట విద్యుత్ వెలుగులు

తిరుపతి కలెక్టరేట్, మే 1 ప్రభాతవార్త :

చేనేత,పవర్‌లూమ్ రంగాలకు బలమైన మద్దతు అందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం ను అమలులోకి తెచ్చింది, ఈ పథకం ద్వారా చేనేత కార్మిక కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు, పవర్‌లూమ్ యూనిట్లకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించబడుతుందని తిరుపతి జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి, పి.విజయానంద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ 2026 ఏప్రిల్ 1వ తేదీ నుండి అమల్లోకి వచ్చిన ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 2588 చేనేత కుటుంబాలకు, 1208 మరమగ్గ కార్మికుల కుటుంబాలకు ప్రత్యక్ష ఆర్థిక ప్రయోజనం కల్గింది. ఈ పథక అమలు పైన జిల్లా వ్యాప్తంగా చేనేత మరియు మరమగ్గ కార్మికులు ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడుకి తమ కృతజ్ఞతలు తెలియచేశారు. వివిధ కారణాల వల్ల ఎవరికైన ఈ పథక లబ్ది పొందలేని చేనేత మరియు మరమగ్గ కార్మికులు జిల్లా చేనేత , జౌళి శాఖ అధికారి వారి కార్యాలయం,తిరుపతిని సంప్రదించగలరు అని తెలిపారు.

సమాజంలో గుర్తింపు అవసరం: భానుప్రకాష్ రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, మే 1 ప్రభాతవార్త :



ప్రజాసేవలో భాగస్వామ్యమైన టూవీలర్ మెకానికులకు సమాజంలో గుర్తింపు అవసరమని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని టిటిడి పాలకమండలి సభ్యులు, బిజెపి సీనియర్ నాయకులు భాను ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. మే డే సందర్భంగా స్థానిక ప్రైవేట్ కళ్యాణ మండపంలో తిరుపతి మోటార్ సైకిల్ మెకానిక్ అసోసియేషన్ 33వ వార్షికోత్సవం సందర్భంగా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల జాబితాకు చెందిన మెకానికులకు సైతం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాల్లో అమలు చేస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెకానికల్ అవసరమైన కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏపీ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నైనారు శ్రీనివాసులు మాట్లాడుతూ మెకానిక్ కార్మికుల సంక్షేమం కోసం సంఘాలు మరింతగా ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రటరీ గురునాథ ఆచారి, వైస్ ప్రెసిడెంట్ ప్రభు, గౌరవ అధ్యక్షుడు జలంధర్, ట్రెజరర్ గౌస్ భాష, జాయింట్ సెక్రటరీ తేజ రెడ్డి, ఎలక్ట్రిక్ మెకానిక్స్ ఇంచార్జ్ విక్కీ, సభ్యులు మణికంఠ, కుపేంద్ర, నాగరాజు, మురుగ, తరుణ్, పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాస్‌లో ఘనంగా నిర్మల దేశ్ పాండేవర్ధంతి వేడుకలు

తిరుపతి కలెక్టరేట్, మే 1 ప్రభాతవార్త : రాస్ సేవా నిలయం నందు సామాజిక సేవకురాలు, శాంతి

దూత, మహాత్మా గాంధీ ఆలోచనలతో బలంగా ప్రభావితమై, వినోబాభావేగారి భూదానోద్యమంలో కీలక పాత్ర పోషించిన అఖిల భారత రచనాత్మక సమాజ్ అధ్యక్షురాలు స్వర్గీయ డాక్టర్.నిర్మల దేశ్ పాండే 18వ వర్ధంతిని ఘనంగా నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి, ఏ.బీ.ఆర్.ఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్. ఎస్.వెంకటరత్నం మాట్లాడుతూ డాక్టర్ నిర్మల దేశ్ పాండే గారు భారత పాకిస్తాన్ మధ్య శాంతి కోసం, మతాసామరస్యాన్ని పెంపొందించడానికి, మహిళల సాధికారతకు, పేదలకు సంక్షేమం కోసం నిరంతరం శ్రమించారని, రాస్ అభ్యున్నతికి కూడా ఎంతో కృషి చేసారని తెలిపారు. స్వర్గీయ డాక్టర్. గుత్తా మునిరత్నం గారితో వారికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.రాస్ అధ్యక్షులు , ఏ.బీ.ఆర్.ఎస్ జాతీయ ఉపాధ్యక్షులు సుందర వడివేలు మాట్లాడుతూ ఆమె మరణం భారతదేశం ఒక గొప్ప సమాజ సేవకురాలని కోల్పోయినట్లు ఉందని, జీవితమంతా స్వార్ధరహిత సేవకు అంకితమైనారని, సిద్ధాంతాలను కేవలం మాటల్లో కాక చర్యల్లో చూపిన మహానుభావురాలని, శాంతి ప్రేమ సేవ అనే విలువలను ప్రపంచానికి పరిచయం చేసిన జీవనస్ఫూర్తి అని తెలియజేశారు.రాస్ సంయుక్త కార్యదర్శి ఏ.బీ.ఆర్.ఎస్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ అధ్యక్షురాలు ఎం.మమత మాట్లాడుతూ డాక్టర్ నిర్మలాదేశ్ పాండే కేవలం ఒక వ్యక్తి కాదు ఆమె ఒక భావం, ఒక మార్గం, ఒక ప్రేరణ అని తెలియజేయడం జరిగింది. రాస్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ వి. బాలాజీ నాయుడు మాట్లాడుతూ నిర్మలాదేశ్ పాండే తో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుంటూ వారి యొక్క సామాజిక సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంకు వారి సహకారంతో 15 మంది మహిళలకు ఉచితంగా టైలరింగ్ మిషన్ల పంపిణీ చేయడం జరిగింది. చేతి కర్రలు, బెడ్ షీట్లు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్, బియ్యం సరుకులు కూడా పేదలకు పంపిణీ చేయడం జరిగినది. పిల్లలు ద్వారా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లు వి.నాగరాజు, యస్.శ్రీనివాసులు, యం.మోహన్, ఆర్.కె.ప్రసాద్, అన్నాదురై ఇతర సిబ్బంది పాల్గొనడం జరిగినది.

గంగమ్మజాతరకు విచ్చేయండి....సిఎంకు ఆహ్వానం

తిరుపతి,మే 1 ప్రభాతవార్త:



తిరుపతి గ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ జాతరకు విచ్చేయాలని సిఎం చంద్రబాబునాయుడును ఆలయ కమిటీ కోరింది. ఈమేరకు ఉండవల్లిలో సిఎం నివాసంలో గంగమ్మ ఆలయ ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్, ఆలయ ఈఓ జయకుమార్, అర్చకులు గంగమ్మ జాతర ఆహ్వానపత్రికను అందించారు. గంగమ్మ అర్చకులు వేదాశీర్వచనం చేయడంతో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

గరుడునిపై మలయప్ప

తిరుమల,మే 1ప్రభాతవార్తప్రతినిధి:

108 వైష్ణవదివ్యదేశాల్లో గరుడసేవ అత్యంత ప్రాముఖ్యత సంతరించుకుంది. గరుడవాహనం ద్వారా స్వామివారు దాసానుదాస ప్రపత్తికి తాను దాసుడని తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. చైత్రపౌర్ణమివేళ సాయంత్రం 7గంటలకు విశేషాభరణాల అలంకృతుడైన మలయప్పస్వామి తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగారు.

8గంటల పని గంటలు అమలు చేయండి

తొట్టంబేడు మే 1 ప్రభాతవార్త:

మే డే కార్మిక దినోత్సవం సందర్భంగా తొట్టంబేడు ప్రాంతాలలో కార్మిక హక్కుల కోసం 8గంటల పని దినం కొనసాగింపుకోసం నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. అంగన్వాడీలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను పరిష్కారం చేయాలని హమాలీ బిల్డింగ్ వర్కర్స్‌కు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఉపాధి హామీ పని దినాలను 200 రోజులకు పెంచి వేతనం 600 చేయాలని పాత మహాత్మా గాంధీ చట్టాన్ని కొనసాగించాలన్నారు. శ్రీకాళహస్తీశ్వర ఆటో స్టాండ్ పానగల్ శాఖ ఐసీడీఎస్ ప్రాజెక్టు తొట్టంబేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తంగెళ్లపాలెం క్వారీ లారీ డ్రైవర్స్ యూనియన్ అంగన్వాడి వాంపల్లి సెక్టార్ శ్రీకాళహస్తి ఐసిడిఎస్ ప్రాజెక్టు బోనుపల్లి చిట్టత్తూరు ఉపాధి హామీ కార్మికులు కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తదితర కేంద్రాలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని సీఐటీయూ జెండా ఆవిష్కరణలు సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగేరి.పుల్లయ్య గంధం మనీ,గురవయ్య, రాజా రాపూర్ సుబ్రహ్మణ్యం, లతా రెడ్డి, సుబ్రహ్మణ్యం,చిట్టిబాబు పెంచలయ్య, రమేష్,ఉస్మాన్ భాష, అన్వర్ భాష, చలివేంద్రం సి.గురవయ్య,జి వేణు,సౌజన్య, రేవతి, గురునాథం, రాధమ్మ, ప్రవళిక, మూర్తి, ఈశ్వరయ్యతదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం

తొట్టంబేడు మే 1 ప్రభాతవార్త :

మే డే సందర్భంగా అంబేద్కర్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కూడలి వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా బాబాసాహెబ్ అంబేద్కర్ కార్మికుల హక్కుల సాధనకై నిరంతరం పోరాటం చేసి పని గంటలు, మహిళలకు ప్రసూతి సెలవులు, ఉద్యోగస్తులకు కార్మికులకు సాధారణ సెలవులు కోసం పోరాడాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు గున్నయ్య ఉపాధ్యక్షులు ఆనంద్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య ట్రెజరర్ శ్రీహరి సంయుక్త కార్యదర్శి రామ్మూర్తి, రిటైర్డ్ ఎంప్లాయిస్ నియోజకవర్గ అధ్యక్షులు బి నాగరాజు . ఎంప్లాయిస్ యూనియన్ కోఆర్డినేటర్స్ రామయ్య చిరంజీవి. మరియు ఆర్టీసీ ఎంప్లాయిస్ రమణయ్య జగన్నాథం పోలీస్ శాఖ నుండి వేలూరు కృష్ణయ్య మరియు వివిధ సంఘ నాయకులు పాల్గొన్నారు.

పేదలకు ఆదరువుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్!

-లక్కమనేని మధుబాబు,డా.యం.ఉమేష్ రావు

శ్రీకాళహస్తి మే 1 ప్రభాతవార్త:



చాలీచాలని ఆదాయంతో కుటుంబ అవసరాలకు తగినంత ఖర్చు పెట్టుకోలేని పేద ప్రజలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ ఎంతో ఆదరువుగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యం.ఉమేష్ రావు కొనియాడారు. ఈ సందర్భంగా వారు 18 వ వార్డు, జయరాం రావు వీధిలో ఖిపేదల సేవలో ప్రజా ప్రభుత్వంఖి పేరిట శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి లబ్దిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ జి.దశరథాచారి,వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి,సీనియర్ నాయకులు లక్కమనేని మధుబాబు,మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా,నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, 52 వ బూత్ కన్వీనర్ గాజుల భగత్ తదితరులు పాల్గొన్నారు.

పించన్లు పంపిణీలో రావిళ్ళ

తొట్టంబేడు మే 1 ప్రభాతవార్త :

తొట్టంబేడు మండలంలోని లింగం నాయుడు పల్లి గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాను సారంశ్రీకాళహస్తి శాసనసభ్యులు, బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ కార్యక్రమం జరిగిందని మండల పార్టీ అధ్యక్షులు మునిరాజా నాయుడు అన్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధులకు వితంతువులకు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరు కొత్త పెన్షన్ కూడా నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిత పాటు క్లస్టర్ ఇంచార్జ్ రమేష, ఎండిఓసురేంద్రనాథ్ డిప్యూటీ ఎండిఓ భార్గవ్ స్వర్ణముఖి ఆయా కట్టు వైస్ చైర్మన్ శంకర్ నాయుడు, బూత్ ఇంచార్జ్ శ్రీనివాస్, విజయ్ కుమార్, పుల్లయ్య, రంగయ్య తదితర లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి విద్యార్థికి ఎమ్మెల్యే చేసన్మానం

శ్రీకాళహస్తి రూరల్ మే 1 ప్రభాతవార్త:



శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆర్డీవో భాను ప్రకాష్ కలిసి శుక్రవారం ఊరందరు గ్రామంలోని వారి స్వగృహం నందు ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన శ్రీకాళహస్తి మండలం, కుంటిపూడి గ్రామానికి చెందిన పాపిశెట్టి వేణుగోపాల్–సునీత దంపతుల కుమార్తె జస్మితకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జస్మిత 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ ర్యాంక్, జిల్లాలో ప్రథమ ర్యాంక్ సాధించడం గొప్ప గర్వకారణం గా ఉందన్నారు. అదేవిధంగా మున్సిపల్ హై స్కూల్ బాబు అగ్రహారం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొండమనాడు పాఠశాలలకు చెందిన సాయి పూజిత,మోహిత్ చరణ్ సాయి కూడా తమ ప్రతిభను చాటినందుకు వారిని, వారి తల్లిదండ్రులను కలసి ఎమ్మెల్యేచే అభినందన సభ ఏర్పాటు చేసి విద్యార్థులను సన్మానించి నగదు బహుమతులు అందజేసి, ముగ్గురు విద్యార్థులకు 3 సెంట్ల భూమి ఇస్తాం అని హామీ ఇచ్చారు.

నిరుపేదల కళ్ళలో ఆనందమే ప్రభుత్వ లక్ష్యం : ఎంఎల్ఏ

ఏర్పేడు,మే 1 ప్రభాతవార్త: ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామంలో శుక్రవారం స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వవెంకటసుదీర్‌రెడ్డి ఎన్‌టిఆర్ బరోసా పెన్షన్లను అందించారు.మేర్లపాక దళితవాడలో ఆయన పెన్షన్లను అందించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ లక్ష్యం నిరుపేదల కళ్ళలో సంతోషాన్ని చూడాలని అలాగే ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలని కోరుకునే ప్రభుత్వ అన్నారు. రాష్ట్రంలో ప్రతి నెల 1వ తేది కోసం నిరుపేదలు ఎదురు చూసే రోజుగా మారిందన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రాబోవు రోజుల్లో కొత్త పెన్షన్లకు అవకాశం ఉందన్నారు.అ ర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ను అందించుటకు ప్రణాళిక రూపొందించినట్లు ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి వివరించారు.ఈ కార్యక్రమాల్లో మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు నాగరాజ నాయుడు,జిల్లా గ్రంధాలయ చైర్మెన్ రెడ్డివారి గురువారెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ధనంజయులు నాయుడు,శివశంకర్‌రెడ్డి, పొన్నారావు, మోహన్ నాయుడు, గాలి కృష్ణవేణి, బాబునాయుడు,బత్తలగిరిబాబునాయుడు,తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమందూరులో : ఏర్పేడు మండలం ఆమందూరు పంచాయతీలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజ నాయుడు బత్తల గిరి నాయుడు లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వంలో పొద్దు పడవకముందే పింఛన్లు పంపిణీ చేసి గ్రామీణ ప్రాంతాల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు గుణాయాధవ్, సుబ్రమణ్యం, కేశనేని సుబ్రమణ్యం, నగేష్ ,వై మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పది విద్యార్థుల పరుగులు

ఏర్పేడు,మే 1 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి నియోజకవర్గం ఏర్పేడు మండలంలోని పలు పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు మార్కుల వర్షం కురిపించారు.శుక్రవారం విద్యాశాఖ విడుదల చేసిన ఫలితాల వివరాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కార్పొరేట్ కన్నా తక్కువేమి కాదని నిరూపించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలో ఉపాధ్యా యులు నాణ్యత పెంచారు.బండారుపల్లి ఉన్నత పాఠశాల నుంచి 23 మంది హాజరు కాగా 14 మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ తెలిపారు. మొదటి స్థానం తేజ 548 మార్కులు రెండవ స్థానం మౌలిక 541 సాధించారు. కాగా ఏర్పేడుమండల కేంద్రంలోని పాఠశాల నుంచి 90మంది హాజరు కాగా 47మంది ఉత్తీర్ణులైనట్లు ప్రకటించారు. మొదటి స్థానం విష్ణుప్రియ 545, బి.వర్ష 526, మునగల పాళం ఉన్నత పాఠశాలల నుంచి 37మది పరీక్షలకు హాజరు కాగా 29మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి స్థానం నెప్రోరాయ్ 542, ఒరెండవ స్థానం పూజిత 523 మార్కులు సాధించారు. పాపానాయుడుపేట పాఠశాల నుంచి 77 మంది హాజరు కాగా 61 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదట స్థానం విహారి సాగర్, 502 మార్కులు కౌసల్య 535 సాధించారు. పంగూరు ఉన్నత పాఠశాలలో 51 మంది హాజరుకాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి స్థానం బి.లక్ష్మీ 516, గురువైష్ణవి 501 మార్కులు సాధించి ఒరెండవ స్థానం లో నిలిచారు. కందాడు ఉన్నత పాఠశాలనుంచి 40మంది హజరు కాగా 31 మంది ఉత్తీర్ణులయ్యారు.మొదటి స్థానం వెన్నెల 570 రెండవ స్థానం భాను563 మార్కులు సాధించి పాఠశాల తలమానికంగా నిలిచారు. పల్లం ఉన్నత పాఠశాలన నుంచి 111మందికి గాను 68మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి స్థానం జి.హేమ 576 ,గాయత్రి 562లు సాధించి మొదటి ఒరెండవ స్థానం సాధించారు.వ్యాసాశ్రమం పాఠశాల నుంచి38మంది హాజరు కాగా అందరూ పాస్ అయ్యారు. నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. విష్ణుప్రియ 567, మొదటి స్థానం సాధించగా ద్వితీయ స్థానం చంద్రకళ 537 మార్కులు సాధించారు. ఇక ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి బాపూజీ విద్యాసంస్థలనుంచి 62 మంది విద్యార్తులు హాజరు కాగా అందరూ పాసైనట్లు బాలాజి నాయుడు వివరించారు. వీరిలో మొదటి స్థానం అనిలా 594 మార్కులు సాధించగా ఏర్పేడు మండలంలోని ఓం నారాయణ పాఠశాల నుంచి 14 మందికి గాను 9మంది పాస్ అయ్యారు. మొదటి స్థానం ప్రణవీ 578 మార్కులు సాధించారు.సాయి బ్రిలియంట్ పాఠశాల నుంచి 49మంది హాజరు కాగా 46 మంది పాస్ అయ్యారు.మొదటి స్థానం ఎస్‌జిస్మిత 578మార్కులు సాధించగా జాహ్నవి 576 మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు.

31లోపు పన్నులు చెల్లించి రాయితి అందుకోండి

తొట్టంబేడు,మే 1 ప్రభాతవార్త:

ప్రభుత్వం పంచాయతీల్లో పన్నులను చెల్లించుటకు మరో అవకాశం కల్పించిందని ఈ అవకాశాన్ని పన్ను చెల్లింపు దారులు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.సరేంద్రనాథ్ శుక్రవారం వివరించారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖ 2026–27 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నులు ఇతర పన్నుల చెల్లింపులకు సంబంధించి ఈనెల 1 నుంచి 31 వరకు చెల్లిస్తే 5శాతం రాయితి ఉంటుందని వివరించారు. పన్ను చెల్లింపుదారులు సరాసరి ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చునని లేదా నగదు, డిడిల రూపంలో చెల్లించవచ్చునని వివరించారు.ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ పి.సురేంద్రనాథ్ వివరించారు.

భారత దేశంలో ఎక్కడా లేని పెన్షన్ల వ్యవస్థ

ఏర్పేడు మే 1 ప్రభాతవార్త :

భారత దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపాలని వారి కళ్ళలో సంతోషాన్ని చూడాలని ప్రతి నెల 1వ తేది పొద్దుపొడవక ముందే పెన్షన్లను అందిస్తున్నారని రెడ్డివారి గురువారెడ్డి అన్నారు. పేదల సేవలో ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో స్వర్ణ గ్రామం సిబ్బందితో భర్త చనిపోయిన 29 రోజులకే సాంబయ్యపాలెం యానాదిరెడ్డి భార్య చంచమ్మకు 4వేల రూపాయలు పెన్షన్ ని అందజేసినట్టు ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మాజీ సర్పంచ్ శివశంకర్ రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం యాదవ్, బూత్ కమిటీ కన్వీనర్లు శంకర్ రెడ్డి,రవిచంద్ర, తదితరులతో పాటు పంచాయతీ సెక్రెటరీ స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులను సన్మానించిన తలపా

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:

మేడే కార్మికుల దినోత్సవం సందర్భంగా భవన నిర్మాణ కార్మికులను సన్మానించి వారికి దుస్తులను ప్రధానం చేసి వారికి మే డే శుభాకాంక్షలను శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి శుక్రవారం పత్రికల వారికి తెలిపారు. ఈ సందర్భంగా తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరూ సౌకర్యవంతంగా వారి వారి అవసరాలు తీరుతున్నాయి అంటే కార్మికుల కష్టాల ఫలితమేనని, కార్మికులు దేశాభివృద్ధిలో కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల అధ్యక్షులు సురేంద్రరెడ్డి, రేణిగుంట మండలం అధ్యక్షులు రాహుల్ రాయల్,మునికృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:



మే డే కార్మికుల దినోత్సవం సందర్భంగా జనసేన పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణం రామసేతు వంతెన వద్ద భవన నిర్మాణ కార్మికులకు అల్పాహార పంపిణీ చేశామని జనసేన నాయకులు తెలిపారు.. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల కష్టాలకు స్పందించే పార్టీ జనసేన పార్టీ అని, పేద వాడి కన్నీళ్లు తుడిచి పార్టీ జనసేన పార్టీ అని మాట్లాడుతూ 2020 సంవత్సరం లో ఇసుక లేక దాదాపు 32 మంది కార్మిక కూలీలు మరణిస్తే వారికి అండగా నిలిచింది ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,జనసేనా పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే

శ్రీకాళహస్తి, మే 1 ప్రభాతవార్త:

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఘనంగా 140 వ మేడే ఉత్సవాలు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ స్సందర్భంగా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ మురళి మాట్లాడుతూ ఏఐటీయూసీ అనుబంధ ప్రజా సంఘాల అధ్వర్యంలో ఎర్రతోరణాల అలంకరణల తో ఎనిమిది గంటల పని ముద్దు పన్నెండు గంటల పని విధానం వద్దు, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నశించాలనే నినాదాలతో కార్మికులు హోరెత్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య, పట్టణ కార్యదర్శి రొద్ద గోపి ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి తొండు మల్లికార్జున, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కత్తి రవి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు చారులత, సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు అయ్యప్ప ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ముని చందు ప్రజానాట్యమండలి నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ నాయకులు తమీమ్, ధర్మేంద్ర, వీధి విక్రయ దారుల సంఘం నాయకులు జనార్దన్, మురళి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు హరి, జాన్ సివిల్ సప్లై హమాలిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు గిరి, రుక్కు, దయాకర్ నాయుడు, ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి మరియు పట్టణంలోని కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగిందన్నారు.